

నా పేరేంటి?

రాజమండ్రినా.. రాజమహేంద్రవరమా?

» గత పుష్కరాల్లో పేరు మార్పు
» మళ్లీ పుష్కరాలు వస్తున్నా అంతే
» కేంద్రం గుర్తించని వైనం
» ఎంపీ చొరవ చూపాలి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమండ్రిని రాజమహేంద్రవరంగా పేరు మార్పుచేసి పదేళ్లు దాటినా ఇప్పటికీ రైలుపై రాజమండ్రి, బస్సుపై రాజమహేంద్రవరం అని దర్శనమిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల్లో మార్పు లేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు రాజమండ్రి అని పిలుస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరమని సంభోదిస్తోంది. అధికారిక కార్యకలాపాల్లో కూడా రాష్ట్రానికి ఒక పేరుంటే.. కేంద్రానికి మరో పేరు ఉంటూ అయోమయానికి గురిచేస్తున్నాయి. పేరు మార్చి పదేళ్లు దాటినా పాత పేరునే ఇంకా అధికారిక కార్యక్రమాలు సాగుతున్నాయి. మద్రాసును చెన్నై, అహ్మదాబాద్‌ని ప్రయాగ్‌రాజ్ అని పేరు మార్పు చేసిన కొద్ది నెలల్లోనే అటు కేంద్రంలో కూడా కొత్త పేర్లు మనుగడలోకి వచ్చాయి. కానీ రాజమండ్రిని మాత్రం పట్టించుకున్నవాళ్లు లేరు.

రాజమండ్రికి వెయ్యేళ్ల చరిత్ర

రాజమహేంద్రవరానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని రాజరాజనరేంద్రుడు పాలించాడు. ఆయనకు రాజమహేంద్ర అనే బిరుదు ఉంది. దీంతో రాజమహేంద్రవరం అనే పేరు వచ్చిందని చరిత్ర చెబుతోంది. తర్వాత క్రమంలో రాజమహేంద్రిగా.. ఆపై బ్రిటిషర్ల పాలనలో రాజమండ్రిగా రూపాంతరం చెందింది. అందుకే రాజమండ్రి అనే పేరుకు ఎలాంటి ప్రాతిపదిక కనిపించదు. 2015 జూలై 14 నుంచి 25 వరకూ గోదావరికి మహా పుష్కరాలు నిర్వహించారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా సీఎంగా చంద్రబాబు ఉన్నారు. పుష్కరాల చివరి రోజున ఆర్ట్స్ కళాశాల మైదానంలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. చారిత్రక ప్రదేశాలు, చరిత్ర ఆనవాళ్లు తెలిపే పేర్లను మార్చడం సబబు కాదని.. రాజమండ్రిని 'రాజమహేంద్రవరం'గా పేరు మార్పు చేస్తున్నట్టు ప్రకటించారు. 2015 డిసెంబరు 22న వెలువడిన జీవో నెం.483 ఆధారంగా కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో పేరు మార్పును 20/846 అంశంగా చేర్చి అంగీకరిస్తూ తీర్మానించారు. అయినప్పటికీ ఇప్పటికీ కేంద్ర సంస్థల్లో పేరు మారలేదు. టీడీపీ ప్రభుత్వం తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పేరు మార్పును పట్టించుకోలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో కేంద్ర ప్రభుత్వంలో కూడా రాజమహేంద్రవరంగా పేరు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



తెలియక అయోమయం

దూర ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరం వచ్చే వాళ్లు అయోమయానికి గురవుతున్నారు. రైలు, విమాన టికెట్లపై రాజమండ్రి అని ఉంటోంది. ఇక్కడికి వచ్చాక రాజమహేంద్రవరమనే బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల రిజర్వేషను పోర్టల్‌లో రాజమహేంద్రవరం అని, రైల్వే పోర్టల్‌లో రాజమండ్రి ఉండడంతో ఇబ్బంది ఎదురవుతోంది. రైల్వే, పీఎఫ్, పోస్టల్ వంటి కేంద్ర ప్రభుత్వ శాఖలు/సంస్థల కార్యాలయాల బోర్డులు రాజమండ్రి అని ఉంటున్నాయి. ఉదాహరణకు ఏసీబీ, పీఎఫ్ కార్యాలయాలు ఎదురెదురుగా ఉంటాయి. ఈ బోర్డుపై రాజమహేంద్రవరం, ఆ బోర్డుపై రాజమండ్రి అని రాసి ఉంటుంది. అధికారిక ఉత్తరాలు, కార్యకలాపాల్లోనూ ఈ గందరగోళం గోచరిస్తోంది. ఎంపీని రాజమండ్రి ఎంపీ అని, ఎమ్మెల్యేని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే అని వ్యవహరించడం తప్పడం లేదు. ఎంపీ పురందేశ్వరి స్పందించి రాజమహేంద్రవరం అని పేరు మార్పు చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. పేరు మార్చకుంటే మళ్లీ గోదావరి పుష్కరాలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు ఇబ్బందులకు గురికావడం ఖాయంగా కనిపిస్తోంది.



ట్రాఫిక్ సిగ్నల్స్.. నేలచూపులు!

నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిందని, ట్రాఫిక్ సిగ్నల్స్ సవ్యంగా పని చేస్తే వాహనదారుల అదృష్టమేనని 'ఆంధ్రజ్యోతి' ఆదివారం 'ట్రాఫిక్ టెర్రర్' పేరుతో ప్రచురించిన కథనంలో పేర్కొంది. ఆ కథనం అక్షర సత్యమని ఈ ఫొటోలు రుజువు చేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కంబాల చెరువు కూడలిలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌ని పీకేసి ఇలా ఎండలో ఆరబెట్టారు. మిగతా సిగ్నల్స్ నిలబడిన స్థితిలోనే పడుకున్నాయి. ప్రతి కూడలిలో సిగ్నల్స్ పరిస్థితి ఇదేవిధంగా మారడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఎప్పుడు వెలుగుతాయో, ఏ సమయంలో నిద్దరోతాయో తెలియని ట్రాఫిక్ సిగ్నల్స్‌ని పూర్తిగా తొలగించేస్తే నయమని జనం మండిపడుతున్నారు. పోలీసులకు వాహనదారుల ఫొటోలు తీయడంపై ఉన్న శ్రద్ధ సదు పాయాల కల్పనపై ఉండడం లేదంటూ ఎద్దేవా చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరం



సత్యసాయి సందేశాలు సమాజాన్ని నడిపించే వెలుగులు



సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జేసీ మేఘస్వరూప్, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు.. మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

» జేసీ మేఘ స్వరూప్ » ఘనంగా శత జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమ, సేవ, దయపై ఇచ్చిన సందేశాలు ఎప్పటికీ సమాజాన్ని నడిపించే వెలుగులని జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి జిల్లాస్థాయి వేడుకలను ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రకాశనం, వేదపారాయణం, భజనలు, కీర్తనలు, నృత్య ప్రదర్శనలతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ సేవే పరమధర్మం అనే సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించి చూపిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆరోగ్యం, విద్య, శుద్ధజల ప్రాజెక్టులు, పేదల సంక్షేమం, విపత్తుల సమయంలో అందించిన సహాయం వంటి ఎన్నో సేవలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. యువత తమ శక్తి, ప్రతిభ, సమయాన్ని సమాజ సేవలో వినియోగిస్తే దేశ అభ్యున్నతి మరింత వేగవంతమవుతుందని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ భారతీయత సారాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావుడు సత్యసాయి బాబా అని అన్నారు. 140 దేశాల్లో ఆయన సేవలు నడుస్తుండడం విశ్వసేవకు నిదర్శనమన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ పుట్టపర్తి వంటి వెనకబడిన ప్రాంతాన్ని ప్రపంచపటంలో దీటుగా నిలబెట్టిన సాయి సేవలు మరువరానివన్నారు. గురుకుల విద్య తన జీవితానికి మార్గదర్శకమైందన్నారు. శతజయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. రుడా చైర్మన్ వెంకట రమణచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వాలకంటే ముందుగానే తాగునీరు, విద్య, వైద్యం వంటి సంక్షేమ పథకాలను అమలుచేసి లక్షలాది కుటుంబాల్లో సాయిబాబా వెలుగులు నింపారన్నారు. ప్రేమ, సేవ అనే రెండు విలువలను జీవితాంతం ఆచరించి ఆదర్శంగా నిలిచిన మహనీయుడు సత్యసాయి అని, ఉచిత విద్య, వైద్యం, తాగునీరు వంటి సేవలను సాయి సెంట్రల్ ట్రస్టు అందిస్తోందని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యామ్ సుందర్ తెలిపారు. అన్ని మతాల సారం ఒకటేననేదే బాబా బోధనల సారాంశమని ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఇంచార్జి డీఆర్వో భాస్కరరెడ్డి, సీపీవో ఎల్.అప్పలకొండ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన..

బాబోయ్.. బాదుడు



» సంక్రాంతి పండుగకు ఊరొచ్చే దారేది
» అప్పుడే బస్సులు, రైళ్లు, విమాన చార్జీల దోపిడీ
» జనవరి 10 నుంచి వీటన్నింటిలో టికెట్ ధరలు మూడింతలపైనే
» హైదరాబాద్ టు రాజమహేంద్రవరం ఏకంగా రూ.16 వేలు దాటేసిన ఇండిగో చార్జి
» బెంగళూరు నుంచి రూ.14వేలపైనే
» హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వైపు వచ్చే రైళ్లన్నీ రిగ్రెట్
» అటు ప్రైవేటు ట్రావెల్ బస్సుల ఏసీ స్లీపర్ చార్జీలు తడిసిమోపెడు
» హైదరాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో జనవరి 9 నుంచే సీట్లు సున్నా

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగకు అప్పుడే చార్జీలు షాక్ కొడుతున్నాయి. స్వగ్రామాలకు రావాలంటేనే టికెట్ ధరలు గూబగుయ్‌మనిపిస్తున్నాయి. బస్సులు.. విమానాలు.. రైలు చార్జీలు మూడింతలు పెరిగిపోయాయి. టికెట్ కొందామన్నా ఏకంగా దొరకని పరిస్థితికి చేరిపోయాయి. వచ్చే ఏడాది జనవరి 14న బుధవారం సంక్రాంతి పండుగ. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కూడా ముందుగానే జనవరి 10 నుంచి సెలవులు ప్రకటించాయి. దీంతో అప్పటి నుంచి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి పనులపై ఎక్కడెడక్కడో ఉంటున్న వారంతా పండుగకోసం ఉమ్మడి జిల్లాలో వారి స్వగ్రామాలకు చేరుకుంటారు. ప్రధానంగా సంక్రాంతికి ఉమ్మడి జిల్లాకు చెందిన వారు హైదరాబాద్ నుంచి ఎక్కువగా వస్తుంటారు. అక్కడ వ్యాపారాలు, ఉద్యోగాలు, సినిమా రంగంలో ఉన్నవారు, పండగ ఆనందాలకు బంధువుల రూపంలో కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ ప్రాంతాలకు వస్తారు. అయితే ఇప్పటి నుంచే చార్జీలు ఆకాశాన్నంటేశాయి. సాధారణంగా సంక్రాంతి పండగకు వచ్చే వారికి ఎప్పుడో డిసెంబరు రెండో వారం నుంచి చార్జీలు పెరుగుతుంటాయి. కానీ ఈసారి పండుగకు ఏకంగా నవంబరుకే అన్నీ మూడింతలు పెరిగిపోయాయి. హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లా వైపు వచ్చే రైళ్లన్నీ నిండిపోయి ఇప్పటికే రిగ్రెట్ చూపిస్తుండడం విశేషం.

బాబోయ్ ఎగరలేం..

పండగ అంటే సంక్రాంతి. ఈ పండుగకు ఎవరు ఎక్కడ ఉన్నా ముందుగానే రెక్కలు కట్టుకుని సొంతూర్లకు రావలసిందే. బంధుమిత్రులతో సరదాగా గడపాల్సిందే. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి సందడే వేరు. భోగిమంటలు, కోడి పందేలు, గుండాట, జాతర్లతో ఏ ఊరు చూసినా సందడిగా మారుతుంది. ఉమ్మడి జిల్లాకు చెందినవారు ఎక్కువమంది సినిమా రంగం, ఐటీ, వ్యాపారరంగాలు, ఉద్యోగాల పేరుతో హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. వారంతా పిల్లాపాపలతో సొంతూర్లకు చేరుతారు. అయితే పండుగకు ఇంకా యాభై రోజులు ఉండగానే చార్జీలు మాత్రం అప్పుడే షాక్ కొట్టేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి సాధారణ రోజుల్లో ఇండిగో టికెట్ చార్జీ రూ.4,271 వరకు ఉంటోంది. కానీ జనవరి 10 నుంచి మాత్రం చూస్తే గుండె గుబేల్‌మంటోంది. ఏకంగా ఈ రూట్లో అప్పుడే టికెట్ ఛార్జీ గరిష్ఠంగా రూ.16,241కి చేరిపోయింది. ఈ మార్గంలో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి రోజూ ఇండిగో నాన్‌స్టాప్, సింగిల్‌స్టాప్ కేటగిరీలో ఎనిమిది సర్వీసులు నడుపుతోంది. కానీ సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అప్పుడే ధరలను భారీగా పెంచేసింది. పండుగకు ఎక్కువమంది కాస్త ధర ఎక్కువైనా వేగంగా వచ్చేందుకు విమానాలనే ఎంచుకుంటున్నారు. దీంతో జనవరి నుంచి భోగి పండుగ రోజు వరకు చార్జీలను దారుణంగా పిండేస్తోంది. తీరా సంక్రాంతి పండుగ రోజురూ.5,800 మాత్రమే వసూలు చేస్తోంది. అటు బెంగళూరులో పనిచేస్తోన్న ఉమ్మడి జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పండుగకు ముందే వస్తారు. వీరిని కూడా జనవరి 10వ తేదీ నుంచి రూ.14 వేల వరకు పిండేస్తోంది. సాధారణ రోజుల్లో ఈ రూట్లో చార్జీ రూ.4,763కాగా, పండగ సాకుతో మూడింతలపైనే వసూలు చేస్తోంది.

రైళ్లన్నీ రిగ్రెట్...

హైదరాబాద్ నుంచి సంక్రాంతి పండగకు ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, సామర్లకోట, కడియం, అన్నవరం, తుని, కోనసీమ ప్రాంతాలకు వచ్చే వారంతా ఎక్కువగా రైళ్లపై ఆధారపడతారు. తీరా ఇవి కూడా వెయిటింగ్ లిస్ట్ కూడా నిండిపోయి ఏకంగా రిగ్రెట్ చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఈ రూట్లో రైళ్లకు రద్దీ ఎప్పుడూ ఉంటుంది. తీరా సంక్రాంతి పండుగకు అయితే అంతకుమించి అన్నట్టు మారిపోయింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లా మీదుగా నిత్యం 17 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే పండగ నేపథ్యంలో జనవరి 10 నుంచి ఇవన్నీ నిండిపోయాయి. ఎప్పుడూ ఎన్నోకొన్ని సీట్లు ఖాళీగా ఉండే వందే భారత్ రైళ్లలో కూడా జనవరి 10 నుంచి 13వ తేదీ వరకు రిగ్రెట్ చూపిస్తోంది. అంటే వెయిటింగ్ లిస్ట్ టిక్కెట్లు కూడా అయిపోయి టికెట్ కూడా ఇవ్వని పరిస్థితికి చేరింది. అలాగే గరీబ్ రథ్ జనవరి 12వరకు రిగ్రెట్ చూపిస్తోంది. విశాఖ ఏసీ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ 13వ తేదీ వరకు రిగ్రెట్ కనిపిస్తోంది. చర్లపల్లి, సాయినగర్ షిర్డీ, ఈస్ట్‌కోస్ట్, కోణార్క్, విశాఖ ఎల్‌టీటీ సైతం అదే పరిస్థితి. చివరకు హైదరాబాద్ నుంచి వచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కూడా 13 వరకు సీట్లన్నీ రిగ్రెట్‌లోకి వెళ్లాయి.

ట్రావెల్స్ ఉతుకుడు..

ప్రైవేటు ట్రావెల్స్ విషయానికొస్తే హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం వైపు వచ్చేవన్నీ అప్పుడే చార్జీలు మూడింతలు పెంచేశాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వైపు ఏసీ స్లీపర్ బస్సు చార్జీలు రూ.1079 నుంచి రూ.1419 వరకు ఉన్నాయి. కానీ సంక్రాంతి దోపిడీలో భాగంగా జనవరి 10 నుంచి ఏకంగా ఆయా ట్రావెల్స్ ఆధారంగా రూ.4150 నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే సగానికిపైగా సీట్లు ఫుల్ అయినట్టు చూపుతున్నాయి. పండుగ దగ్గరయ్యే కొద్దీ ఈ రేట్లు మరింత పెంచడానికి సిద్ధమవుతున్నాయి. ఇక హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఆర్టీసీ రోజుకు 15 ఏసీ, నాన్‌ఏసీ సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతుం డగా, జనవరి 9 నుంచి 12 వరకు మూడు రోజుల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేదు. మొత్తం అన్నీ బుక్ అయిపోవడంతో సోల్డ్‌అవుట్ కనిపిస్తోంది. కాకినాడకు హైదరాబాద్ నుంచి రోజూ ఆరు సర్వీసులు నడుస్తుండగా జనవరి 9 నుంచే ఫుల్ అయిపోయాయి

ఆన్‌లైన్ రిజిస్టర్లు లేవు..

» మాన్యువల్‌గా చూస్తున్నారు
» కాలం చెల్లిన మందుల విచారణలో అధికారుల నివేదిక?



విలేకరులతో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రుల్లో కాలం చెల్లిన మందులను ఇస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు చేపట్టిన దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి వచ్చిన మందులను ఆన్‌లైన్ చేయకుండా ఆఫ్‌లైన్‌లో రిజిస్టర్‌లు నిర్వహిస్తున్నారంటూ దర్యాప్తులో పేర్కొన్నారు. దీనివల్ల ఏ మెడిసిన్ ఎవరికి అందుతున్నదానిపై పూర్తి వివరాలు తెలియడం లేదని, దీనిపై వైద్యాధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించినట్టు సమాచారం. అయితే కాలం చెల్లిన మందులను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సక్రమంగా నిర్వహణ చేయడంలేదనే విషయాన్ని దర్యాప్తు అధికారులు ప్రధానంగా ప్రస్తావించినట్టు సమాచారం. ఇదిలా ఉంటే కాలం చెల్లిన మందులను ఇచ్చారంటూ సీఎంకు వెళ్లిన ఫిర్యాదు, తదనంతర పరిణామాలపై దర్యాప్తు అధికారులు స్పష్టమైన నివేదిక రూపొందించలేదని తెలుస్తోంది. నారాయణపురం పరిధిలోని చౌడేశ్వరీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి 55 ఏళ్ల మహిళ రెండు దఫాలుగా మందులను తీసుకున్నట్టు నిర్ధారించినా ఆ మందుల ఎక్స్‌పైర్ విషయంలో ఎలాంటి స్పష్టత రావడంలేదు. ఆఫ్‌లైన్‌లో రిజిస్టర్‌లు ఉండడంతో వివరాలు దర్యాప్తులో తేలనట్టు సమాచారం.

జీజీహెచ్‌కు సంబంధం లేదు

అయినా సమగ్ర విచారణకు ఆదేశం

48 గంటల్లో కలెక్టర్‌కు నివేదిక

: జీజీహెచ్ సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చిన ఒక వ్యక్తికి కాలం చెల్లిన బీపీ మందులు ఇచ్చారంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. అయినా ఈ ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించామని, 48 గంటల్లో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు ఆదివారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని తన చాంబర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి డ్రగ్ స్టోర్, ఫార్మసీ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ఇతర అంశాలను సమగ్రంగా పరిశీలించామని తెలిపారు. సంబంధిత కాలం చెల్లిన బీపీ మాత్రల బ్యాచ్ జీజీహెచ్‌లో ఎప్పుడూ రాలేదని, అయినా దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రాథమిక నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వాధికారులకు నివేదించామని తెలిపారు. కాలం చెల్లిన టాబ్లెట్లు రాజమహేంద్రవరంలోని ఒక అర్బన్‌హెల్త్ సెంటర్ ద్వారా ఇచ్చినట్టు సమాచారం ఉందని, అయితే సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారి వివరాలు, స్థలం కచ్చితంగా తెలపకపోవడంతో నిర్ధారించడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ విషయమై నిజానిజాలు, వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికి నలుగురు అధికారులతో విచారణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణంరాజు, ఆర్ఎంవో డాక్టర్ ఆర్‌వీ సుబ్బారావు, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ (డ్రగ్‌స్టోర్స్) డాక్టర్ షేక్ నసీరుద్దీన్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పి.శ్రీనివాస్‌లతో కూడిన కమిటీ రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు సమర్పించాల్సిందిగా ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పి.శ్రీనివాస్, ఆర్ఎంవో డాక్టర్ సుబ్బారావు, డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జి డాక్టర్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

రూ.8 లక్షల ఆభరణాల బ్యాగ్ అప్పగింత

రైలులో వదిలేసిన ప్రయాణికులు అప్పగించిన ఆర్పీఎఫ్ పోలీసులు



ఆభరణాలను అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ రాజు

రాజమహేంద్రవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైలు ఎక్కే హడావుడిలో ఇబ్బంది ఏర్పడి రైలులో వదిలేసిన బంగారు ఆభరణాలున్న బ్యాగును ప్రయాణికులకు రాజమండ్రి రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) పోలీసులు సురక్షితంగా అప్పగించారు. ఆర్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ బి.రాజు వివరాల ప్రకారం.. కర్నాటకలోని బళ్లారికి చెందిన బి.విశ్వనాథరెడ్డి తన భార్యతో అన్నవరం వచ్చారు. తిరుగు ప్రయాణంలో రైలు ఎక్కడానికి స్టేషన్‌కు వెళ్లారు. బిలాస్‌పూర్-తిరుపతి రైలు అప్పటికే కదిలే స్థితిలో ఉంది. దీంతో విశ్వనాథరెడ్డి హడావుడిగా లగేజీ తీసుకొని బీ కోచ్ ఎక్కి వాటిని ఓ బెర్తులో పెట్టారు. కానీ అప్పటికే రైలు కదలడంతో భార్య ఎక్కలేకపోయారు. ఇది గమనించిన భర్త కూడా కిందకు దిగిపోయారు. లగేజీలు మాత్రం రైలులో ఉండిపోయాయి. దీంతో తర్వాత స్టాప్ అయిన రాజమండ్రి ఆర్పీఎఫ్‌కి సమాచారమిచ్చారు. ఇన్స్‌పెక్టర్ రాజు తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రైలు స్టేషనుకు వచ్చిన వెంటనే ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.శ్రీనివాసులు, హెచ్‌సీ త్రినాథరావు తదితర సిబ్బంది కోచ్‌లోని రెండు ట్రాలీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. విశ్వనాథరాజు దంపతులకు సమాచారం ఇవ్వగా వాళ్లు స్టేషనుకు వచ్చారు. వారి సమక్షంలో బ్యాగులను తెరవగా రూ.8లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు సురక్షితంగా ఉన్నాయి. వాటిని వారికి ఇన్స్‌పెక్టర్ రాజు అప్పగించారు. ఆభరణాలు అప్పగించిన వారికి భార్యాభర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయం వద్ద భోజనాలకు వెళ్తొస్తూ మృత్యుఒడికి...



గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు చక్రాల కింద మోటార్‌సైకిల్

ఎదురెదురుగా ఢీకొన్న మోటార్‌సైకిల్, ఆర్టీసీ బస్సు

ఒకరు మృతి... మరొకరికి తీవ్రగాయాలు

కాకినాడ జిల్లా గొల్లప్రోలు వద్ద ఘటన



సంఘటనా స్థలంలో మరణించిన కృష్ణారావు, తీవ్రంగా గాయపడిన శ్రీను

గొల్లప్రోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయం వద్ద జరిగిన భోజనాలకు వెళ్లి వస్తూ గొల్లప్రోలు వద్ద ప్రమాదానికి గురై ఒకరు చనిపోగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన ఉంద్రు కృష్ణారావు అలియాస్ రాజు(40) బైపాస్‌రోడ్డులో గల భగవాన్ గోపాల్‌బాబా ఆశ్రమంలో వంట పనిచేస్తున్నాడు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఉంటున్న గంధం శ్రీను(40)తో కలిసి గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద జరిగిన భోజనాలకు వెళ్లారు. అనంతరం మోటార్‌సైకిల్‌పై తిరిగి పిఠాపురం వస్తున్నారు. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు నుంచి 216వ జాతీయ రహదారికి వెళ్లే జంక్షన్ వద్దకు వచ్చేసరికి కాకినాడ నుంచి తుని వెళ్తున్న ఆర్టీసీ బస్సు పట్టణంలో నుంచి ఎన్‌హెచ్‌పైకి వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. మోటార్‌సైకిల్ ఆర్టీసీ బస్సు చక్రం కింద ఇరుక్కుపోయింది. ఈ సంఘటనలో ఉంద్రు కృష్ణారావు అక్కడిక్కడే మరణించాడు. శ్రీనుకి తీవ్ర గాయాలు కాగా పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హైవే మొబైల్, గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పి.గన్నవరంలో తాచుపాము హల్‌చల్



బుసలు కొడుతున్న తాచుపాము



పామును డబ్బాలో బంధించిన గణేష్‌వర్మ

పి.గన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ప్రభుత్వాసుపత్రి ఎదుట మన్నే వెంకట సత్యనారాయణమూర్తి నివాసంలో ఆదివారం తాచుపాము హల్‌చల్ చేసింది. పామును స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ పట్టుకున్నాడు. ఈ పాముకు సుమారు 20 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపాడు. రక్తపింజరం జాతి పాములతో అప్రమత్తంగా ఉండాలని సూచించాడు. తాను డబ్బాలో బంధించిన పాములను జనావాసాలు లేని చోట వదులుతానని గణేష్‌వర్మ తెలిపాడు.

పాపికొండలకు పర్యాటకులు..

వీఆర్‌పురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాపికొండల విహారానికి 600 మంది పర్యాటకులు 10 పర్యాటక బోట్లలో వెళ్లారు. ఆదివారం సెలవు కావడంతో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి పాపికొండలు-పేరంటాలపల్లి ప్రకృతి అందాలను తిలకించేందుకు ఎక్కువమంది తరలివచ్చారు. గోదావరిలో బోట్లలో వెళ్లడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పర్యాటకులు తెలిపారు. ముందుగా పేరంటాలపల్లి చేరుకుని మునిమఠం, శివాలయాన్ని దర్శించుకున్నారు. తర్వాత పాపికొండలకు బయలుదేరి ప్రకృతి అందాలను చూసి ఆనందం పొందారు.



పోచవరం ఫెర్రి పాయింట్ దగ్గర పర్యాటకుల సందడి

స్నేహితులతో సరదాగా బీచ్‌కు వెళ్లి...

సముద్రంలో బాలుడి గల్లంతు

పోలీసుల గాలింపు చర్యలు



మహిమరాజు (ఫైల్)

మలికిపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదాగా బీచ్‌కు వెళ్లిన బాలుడు సముద్రంలో గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరి అరుంధతి పేట గ్రామానికి చెందిన మహిమరాజు (14) అలియాస్ బబ్లూ 9వ తరగతి వరకు చదివి ఒక ప్రైవేటు స్కూలు బస్సు క్లీనర్‌గా పనిచేసేవాడు. స్కూలు యాజమాన్యం జీతాలు సరిగా ఇవ్వకపోవడంతో ఆ పని కూడా మానేసి ఖాళీగా ఉంటున్నాడు. ఆదివారం తన స్నేహితులు చుట్టుగుళ్ల ముకేష్, వాస్కూరి సూర్యగణేష్, కొప్పాడి రాకేష్‌తో కలసి చింతలమోరి బీచ్‌కు వెళ్లాడు. వారంతా ఇసుక తిన్నెలపై ఆటలాడుకుని ఫొటోలు తీసుకున్నారు. తర్వాత బబ్లూ, ముకేష్ స్నానానికి దిగారు. కెరటాలు ఉధృతంగా రావడంతో బబ్లూ సముద్రంలో కొట్టుకుపోయాడు. ముకేష్ ఇచ్చిన సమాచారంతో బంధువులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బబ్లూ తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.సురేష్ తెలిపారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సంఘటనపై ఆరా తీశారు. పోలీసులతో మాట్లాడి తగు చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. కాగా సూర్యగణేష్, ముకేష్, రాకేష్ మోరి జిల్లా పరిషత్ హైస్కూలులో పదో తరగతి చదువుతున్నారు. బాలుడు గల్లంతుకా వడంతో మోరి అరుంధతి పేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విహారయాత్రలో విషాదం

సోకిలేరు వాగులో మునిగి విజయవాడకు చెందిన జిమ్ ట్రైనర్ మృతి



మృతిచెందిన సందీప్ (ఫైల్)

చింతూరు/మోతుగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని సోకిలేరు వాగులో మునిగి జిమ్ ట్రైనర్ కె.సందీప్ (30) మృతిచెందాడు. మోతుగూడెం ఎస్ఐ ఎస్కే సాధిక్ తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన 13మంది స్నేహితులు 3 కార్లలో ఆదివారం ఉదయం విహారయాత్రకు మారేడుమిల్లి వచ్చారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో చింతూరు మండలం సోకిలేరు వ్యూ పాయింట్ పరిసర ప్రాంతాలకు వచ్చారు. సోకిలేరు వాగు ఒడ్డున వంట తయారీ పనిలో కొంతమంది నిమగ్నమయ్యారు. వారిలో ఒకరైన నరేంద్ర ముందుగా వాగులో స్నానం చేసి తిరిగి ఒడ్డుకు వచ్చాడు. తదుపరి జిమ్‌ట్రైనర్ అయిన కె.సందీప్ స్నానానికి వాగులో దిగాడు. కొద్దిదూరం ఈతకొట్టి తిరిగి ఒడ్డుకు చేరే క్రమంలో నీటిలో మునిగిపోయాడు. స్నేహితుడు మునిగిపోతున్న విషయం గుర్తించిన మిగిలిన వారంతా సందీప్‌ని రక్షించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చివరకు సందీప్ ప్రాణాలు వదలగా మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి చింతూరు ఏరియా ఆసుపత్రికి అంబులెన్సు సహకారంతో తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా ఈ 13 మందిలో నలుగురు జిమ్ ట్రైనర్లు ఉన్నారు.



ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

కాకినాడలో రెండో రోజు

అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్‌ఏలో రెండోరోజు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ఏ అంతర్ జిల్లాల బాలుర ఖోఖో పోటీలు ఆదివారం ఉల్లాసంగా జరిగాయి. ప్రకాశం, చిత్తూరు, విశాఖ, గుంటూరు జిల్లాల క్రీడాకారులు పోటీపడ్డారు. రాష్ట్ర ఖోఖో సంఘ కార్యదర్శి సీతారామ రెడ్డి, కోశాధికారి ఎల్.గోవిందరాజు, కాకినాడ జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మాచరరావు, టోర్నమెంట్ నిర్వహణా కార్యదర్శి కె.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పట్టాభి, ఎస్‌కెడిఎస్ స్కూల్ చైర్మన్ ప్రభువర ప్రసాద్, గంగనాపల్లి మాజీ ప్రసిడెంట్ నాగబాబు, ఖోఖో కోచ్ వాసులు పోటీలను తిలకించి పర్యవేక్షించారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరిష్ అందించిన టీ షర్టులను ఆవిష్కరించారు. క్వాటర్ ఫైనల్స్‌లో తూర్పుగోదావరి జిల్లాపై విశాఖ జిల్లా 3 పాయింట్ల తేడాతోను, నెల్లూరుపై గుంటూరు ఒక పాయింట్ తేడాతోను, విజయనగరంపై చిత్తూరు 3 పాయింట్ల తేడాతోను, కర్నూలుపై ప్రకాశం 10 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. పోటీల నిర్వహణలో పీడీలు, పీఈటీలు సహకారం అందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి ప్రథమ చికిత్స శిబిరం నిర్వహించారు.

జుడో పోటీలు

కాకినాడ జిల్లా జుడో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్స్ జుడో పోటీలు కాకినాడ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రెండో రోజు ఉత్సాహంగా జరిగాయి. బాలురు, బాలికల విభాగంలో నిర్వహిస్తున్న పోటీల్లో 7 వెయిట్ కేటగిరిల్లో బాలికలకు, బాలురకు నిర్వాహకులు పోటీలు నిర్వహించారు. బాలికల పోటీలను రాష్ట్ర సంఘ సీఈవో వెంకట్, బాలుర పోటీలను జుడో సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ట్రెజరర్ రమణ ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రజట్టును ఎంపిక చేయనున్నారు. జాతీయస్థాయి పోటీలు మణిపూర్‌లో డిసెంబరు 11 నుంచి 15 వరకు జరుగుతాయి. కాకినాడ జుడో సంఘ చైర్మన్ వెంకట కృష్ణారావు, డిసిప్లేన్ కమిటీ కాజా మస్తాన్, టోర్నమెంట్ పరిశీలకులు పివి.తేజ, కార్యదర్శి పవన్ సందీప్, గోవిందు, రామకృష్ణ, స్టేట్ జాయింట్ సెక్రటరీ గమిడి శ్రీనివాసరావు, ఉషరాణి పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందించారు. డీఎస్ఏ జుడో కోచ్, క్రీడాకారులు, కోచ్లు, మేనేజర్లు పాల్గొన్నారు.



జుడో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కాకినాడ జీజీహెచ్‌కు నేడు డీఎంఈ రాక

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణీ మృతిచెందిన ఘటనలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించేందుకు రాష్ట్ర వైద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ జి.రఘునందన్ సోమవారం కాకినాడ జీజీహెచ్‌కు రానున్నారు. విచారణ నిర్వహించాలని వైద్య,ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్‌గౌర్ ఆదేశించిన నేపథ్యంలో నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఘటన జరిగిన కారణాలతో పాటు దారితీసిన పరిస్థితులపై ఆరా తీయనున్నారు. విచారణానంతరం ఈ నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక



ఎంపికైన ఉపాధ్యాయులు

ఎటపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా పోటీలకు అల్లూరి జిల్లా ఎటపాక మండలం నల్లకుంట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న పీడీ సొడే నాగిరెడ్డి, సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఈటీ పెనుబల్లి లక్ష్మణ్‌రావు ఎంపికయ్యారు. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వీరిద్దరు ప్రతిభ కనబర్చారు. పీడీ నాగిరెడ్డి షాట్‌పుట్‌లో ప్రథమస్థానంతోపాటు వందమీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానంలో నిలిచారు. పీఈటీ పెనుబల్లి లక్ష్మణ్‌రావు వందమీటర్ల పరుగుపందెంలో ప్రథమస్థానం తోపాటు లాంగ్ జంప్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. దీంతో బిహార్ రాజధాని పాట్నాలో వచ్చే నెల 13 నుంచి 15 వరకు జరిగే జాతీయస్థాయి ఉద్యోగస్తుల క్రీడా పోటీల్లో ఇద్దరు పాల్గొననున్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

రాజవొమ్మంగి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయలయ్యాయి. రాజవొమ్మంగికి చెందిన బైరున్ అబ్దుల్ ద్విచక్రవాహనంపై సూరంపాలెం వైపు హైవేపై వెళ్తుండగా రాజవొమ్మంగి గ్రామశివారులో టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో అబ్దుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రాజవొమ్మంగి ప్రభుత్వాసుపత్రికి, ఆపై కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

కూరగాయల మాటున గంజాయి

రూ.1.67 కోట్ల విలువైన 332.91 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

రవాణా చేస్తున్న నలుగురి అరెస్ట్... రిమాండ్‌కు తరలింపు : డీఎస్పీ విద్య



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ట్రేల మధ్య గుట్టు చప్పుడు కాకుండా రవాణా చేస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ వివరాలను ఆదివారం డీఎస్పీ విద్య వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఆర్.మురళీమోహన్‌కి గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారం అందింది. దీని ఆ ధారంగా శనివారం సాయంత్రం జీరో పాయింట్ వద్ద వాహన తనిఖీలను చేస్తుండగా రాజానగరం వైపు నుంచి వచ్చిన వ్యాను, కారులోని వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించారు. దీంతో ఆ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వ్యానులోని కూరగాయల ట్రేల మధ్యలో 12 గంజాయి మూటలు, కారు డిక్కీలో ఒక గంజాయి మూటను గుర్తించారు. వాటిలో రూ.1.67 కోట్లు విలువైన 332.91 కిలోల గంజాయి ఉంది. ఆ గంజాయితో పాటు రూ.4.5 లక్షల విలువైన 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. గంజాయిని ఒడిశాలోని బరంపురంలో రాము అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి కర్నాటక తీసుకెళ్తున్నారని చెప్పారు. ఈ కేసులో కర్నాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లా గౌరీబిదనూర్ మండలానికి చెందిన ఇస్మాయిల్ షరీఫ్, ముస్తాన్ ఆలీఖాన్, మన్సూర్, తుమకూరు జిల్లా హంగాడ కాలనీకి చెందిన సుల్తాన్ సలీంని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, షరీఫ్‌పై కర్నాటకలోగంజాయి కేసులున్నాయన్నారు.

ఆలయాల్లో చోరీలు.. దొరికిన దొంగలు!

బంగారం, వెండి వస్తువులు,

ఆటో, మోటార్‌సైకిల్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

గోకవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం లోని 2 ఆలయాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. గోకవరం మండలం కొత్తపల్లిలో రాజలింగేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 16న, గోకవరం గ్రామ శివారున ఉన్న గంగాలమ్మతల్లి గుడి ఆలయంలో అక్టోబరు 21న గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చివరకు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. అల్లూరి సీతారా మరాజు జిల్లా ఎటపాక మండలం తుమ్మల నగరం గ్రామానికి చెందిన పేరాల నరసింహరావు, పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన గుండి జగదీష్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి 12 గ్రాముల బంగారం శతమానాలు, సుమారు కిలో వెండి వస్తువులు, ఆటో, మోటార్‌సైకిల్, హుండీలో దొంగి లించిన రూ.2,000 చిల్లరను స్వాధీనం చేసు కున్నామన్నారు. నిందితులు గోకవరంతో పాటు రాజానగరం, రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో కూడా నేరాలు చేసినట్టు చెప్పారు.

తాబేళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడితో ఫారెస్ట్ పోలీసులు

మోతుగూడెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చదలవాడ పంచాయతీ తులసిపాక ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద తాబేళ్లు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విజయ కుమార్, ఫారెస్ట్ హెల్పర్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా టిప్పర్ ఆటోలో 8 గోనె సంచులతో 248 తాబేళ్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నెల్లూరి విశాఖ అనే వ్యక్తి రావుల పాలెం నుంచి ఒడిస్సా రాష్ట్రం తీసుకెళ్తున్నాడని, 248 తాబేళ్లకు 230 బతికున్నాయని 18 చనిపోయాయని విజయకుమార్ పేర్కొన్నారు. నిందితుడిని కోర్టు తలిస్తామని తెలిపారు.

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన ఐజీ హరికృష్ణ

కడియం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియంలో పల్ల వెంకన్న నర్సరీని ఐజీ (స్పెషల్) హరికృష్ణ సందర్శించారు. నర్సరీ రైతులు పల్ల వెంకటేష్, వినయ్ ఆయనకు స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి నర్సరీని సందర్శించిన హరికృష్ణ నర్సరీలో వివిధ రకాల మొక్కలు చూశారు. నర్సరీ పచ్చని అందాలతో ఉందని, కొత్త రకాల మొక్కలు, నర్సరీ నిర్వహణ చూసి ఐజీ ప్రశంసించారు. గతంలో జిల్లా ఎస్పీగా పనిచేసిన సమయంలో నర్సరీ రైతులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీ రామకృష్ణ, కడియం సీఐ ఏ.వెంకటేశ్వరరావు, ఎస్‌బీ జనార్ధన్ పాల్గొన్నారు.



ఐజీ హరికృష్ణకు మొక్క అందజేస్తున్న పల్ల వెంకన్న నర్సరీ రైతులు

అయినవిల్లిలో ఉన్నతాధికారుల పూజలు



రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్‌కు చిత్రపటం అందజేస్తున్న ఈవో



ఆలయంలో అధికారులకు వేదాశీర్వచనం అందిస్తున్న అర్చకులు

అయినవిల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ సిద్ధివినాయక దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదివారం విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరికాయల మొక్కు తీర్చు కున్నారు. అలాగే కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి, కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, అధికారులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానార్చకులు అధికారులకు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. విజయానంద్ మాట్లాడుతూ దేవస్థాన నిర్వహణ, పూజా విధులకు సంబంధించి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామన్నారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్, తహశీల్దార్ విద్యాపతి పాల్గొన్నారు.

సత్యదేవుడికి ఎస్టీ కమిషన్ చైర్మన్ పూజలు



రథంపై విహరిస్తున్న సత్యదేవుడు,అనంతలక్ష్మి అమ్మవార్లు



సత్యదేవుడి దర్శనానంతరం ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

అన్నవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ఘనంగా రథోత్సవం

సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్ద ఉంచిన రథం వద్దకు బాజాభజంత్రీలతో తోడ్కొనివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రధానోపాధ్యాయుల కృషి

ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ రాజశేఖరం

75 వసంతాల ఏపీహెచ్‌ఎంఏ లోగో ఆవిష్కరణ



ఏపీహెచ్‌ఎంఏ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం

సర్పవరం జంక్షన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రభుత్వం కీలక సంస్కరణలు తీసుకొచ్చిందని, నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడంలో ప్రధానోపాధ్యాయుల కృషి ఎంతో ఉందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ (ఏపీహెచ్‌ఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రవి అధ్యక్షతన ఆదివారం కాకినాడ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 75వ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం ఏర్పడి 75 వసంతాలు పూర్తి చేసుకోవడం, ఇందులో భాగస్వాములుగా ఉండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీఇచ్చారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుని పోస్టని గ్రేడ్-1గా ఉద్యోగోన్నతి కల్పించి డీడీవోగా చేయాలని, డైట్ సీనియర్ లెక్చరర్, సెక్టోరల్, సమగ్ర శిక్షాలో ఏపీసీ పోస్టుల్లో సీనియర్ హెచ్‌ఎంలను నియమించాలని, ప్లస్ 2 పాఠశాలలను బలోపేతం చేయాలని, స్కూల్ అసిస్టెంట్లకు పీజీటీలుగా, హెచ్ ఎంలకు ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని తీర్మానం చేశారు. 75 వసంతాల ఏపీహెచ్‌ఎంఏ లోగోని ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల అధ్యక్షులు కూర్మారావు, మోకా ప్రకాష్, రమణారావు, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, గణేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

ప్రత్యేక సర్వే నెలాఖరుకు పూర్తి: ఆర్డీవో

దివాన్‌చెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులో నిర్మించనున్న ఫ్లైఓవర్ భూసేకరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సర్వే ఈ నెలాఖరుకు పూర్తవుతుందని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. ఆదివారం తనను కలసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. దివాన్‌చెరువులో ఫ్లైఓవర్‌కు భూసేకరణపై కొంతమంది యజమానుల నుంచి వచ్చిన అభ్యంతరాల పరిశీలనకు ఆరుగురు సర్వేయర్ల బృందాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక సర్వే జరిపిస్తున్నామన్నారు. ఈ బృందంలో ముగ్గురు మండల సర్వేయర్లు, మరో ముగ్గురు గ్రామ సర్వేయర్లు ఉన్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాము ఈ చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటి వరకూ 70శాతం సర్వే అయ్యిందని, మిగిలిన సర్వే ఈ నెలాఖరుకు పూర్తవుతుందని తెలిపారు. సర్వేయర్ల బృందం తమకు ఇచ్చే నివేదికను పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామన్నారు. కాగా ఫ్లైఓవర్ నిర్మాణం పనులను కూడా ప్రారంభించవలసినదిగా సంబంధిత అధికారులకు తెలియజేశామని చెప్పారు. రానున్న గోదావరి పుష్కరాలకు ముందే ఫ్లైఓవర్ పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యం

అనపర్తి జాబ్‌మేళాలో ఎమ్మెల్యే నల్లమిల్లి



జ్యోతి ప్రజ్వలనతో జాబ్ మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ఆదివారం నాటి జాబ్‌మేళాలో 35 కంపెనీలు పాల్గొన్నాయని, 693 మంది అభ్యర్థులు పాల్గొనగా 494 మంది అర్హత సాధించారని, వారికి టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. వికాస పీడీ లచ్చారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కార్పొరేషన్ల డైరెక్టర్లు కర్రి సత్యగౌరి, బేరా వేణమ్మ, నాయకులు ఆళ్ల గోవిందు, కర్రి శేషారత్నం, సుభాషిణి పలువురు అధికారులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామికి ఆభరణాల సమర్పణ



వెండి, బంగారు ఆభరణాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యాపురం సత్యనారాయణ స్వామి అమ్మవార్లకు భక్తులు ఇచ్చిన విరాళలతో తయారు చేయించిన ఆభరణాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సమర్పించారు. ఆదివారం పన్నెండున్నర కాసులు బంగారు సూత్రాలతో కూడిన తాడు, 325 గ్రాముల వెండి యజ్ఞోపవేతంలను ఆలయ చైర్మన్ మళ్ల వెంకట్రాజుతో కలిసి ఆలయ అర్చకులకు అందించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, శాంతి కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు కోలా రామచంద్రరావు, పెండ్యాల ఉమామహేశ్వరరావు, శీలం సత్యనారాయణ, నక్కల హరిప్రసాద్, వంజరపు శంకర్, కేఎస్ఎన్‌వీ అన్నపూర్ణ, కొప్పల రామేశ్వరి, ఏఎస్ఎస్ కుమారి, పాణింగపల్లి సత్యశ్రీనివాస ఆచార్యులు, శీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సప్పా ఎక్సలెన్స్ పురస్కారాల ప్రదానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఖ్యాతి పొందిన నాట్య పండితుడు సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సప్పా ఎక్సలెన్స్-2025 జాతీయ పురస్కార ప్రదానోత్సవం ఆదివారం స్థానిక తాడితోట సంహిత కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. సేవా రంగం నుంచి వంశీ రామరాజు, నందూరి సుబ్బారావు, నిమ్మలపూడి గోవిందు,వైద్యరంగం నుంచి డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ఎం.రామకోటేశ్వరరావు, ఆధ్యాత్మిక రంగం నుంచి రాపాక శ్రీనివాస్, పత్రికా రంగం నుంచి పొత్తూరి సుబ్బారావు, కుడుపూడి పార్థసారధి, రచనా రంగం నుంచి శిఖామణి, కళా రంగం నుంచి మల్లికార్జున్, నాట్య రంగం నుంచి వేణుగోపాల్, హేమసుందర్‌లకు పురస్కారంతోపాటు జ్ఞాపిక, నూతన వస్త్రాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సోము వీర్రాజు, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ డి.మునిరత్నం, తుమ్మిడి రామ్‌కుమార్, కేవీ రెడ్డి, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, ఏఎస్పీ చెంచెరెడ్డి, ఆదిత్య ఎస్పీ గంగిరెడ్డి, పంతం కొండలరావు తదితరులు విచ్చేసి నాట్య రంగానికి దుర్గాప్రసాద్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలు శిష్య బృందాలు భరత నాట్యం, ఆంధ్ర నాట్యం, కూచిపూడి నాట్య ప్రదర్శన చేశారు.

మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు, హాస్టల్ విద్యార్థులు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కంబాలపేట యూపీహెచ్‌సీ పరిధిలోని పదహారు ఎస్సీఎస్టీ, బీసీ వసతి గృహాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా మానసిక ఆరోగ్య బృందంలోని డాక్టర్ అఖిలేంద్ర శ్రీనివాస్, సైకియాట్రిస్ట్ ఎస్.ప్రియాంకరాయ్ కలిసి యువతలో మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళన, నిరాశ, ఒత్తిడి వంటి మానసిక సమస్యలను ఎలా గుర్తించాలి, ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలో వివరించారు. దైనందిన జీవితంలో అనుసరించగలిగే ఒత్తిడి నిర్వహణ పద్ధతులు, ఆరోగ్యకర జీవనశైలి, అవసరమైతే నిపుణుల సహాయం పొందడం ఎంత ముఖ్యమో తెలియజేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మల్లాది అనూహ్య, హెల్త్ అసిస్టెంట్ డీడీ భవాని, ఆశాలు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూహ్య మాట్లాడుతూ తక్షణ మానసిక ఆరోగ్య సహాయం కోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 14416పై ప్రత్యేకంగా అవగాహన కల్పించి, ఈ సేవల ద్వారా యువత త్వరగా సహాయం పొందవచ్చని తెలియజేశారు.

జనసైనికులకు అండగా ఉంటాం: ఎమ్మెల్సీ నాగబాబు



జనసైనికుడి కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న నాగబాబు

బిక్కవోలు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనసైనికులకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు తెలిపారు. మండలంలోని కొంకుదురు గ్రామానికి చెందిన జనసేన క్రియాశీల సభ్యుడు బందుల సుబ్బారావు ఇటీవల ఓ ప్రమాదంలో మృతి చెందాడు.దీంతో అతడి భార్యకు ఆదివారం తాడేపల్లి అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో రూ.5 లక్షల చెక్కును నాగబాబు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఇందల వీరబాబు, జనసైనికులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులతో చంపేస్తున్నారు

స్థానిక ఎమ్మెల్యే ఎక్కడ?: మాజీ ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన మందులను ఇచ్చి రోగులను చంపేస్తున్నారని మాజీ ఎంపీ భరత్‌రామ్ ఆరోపించారు. ఇటీవల అలాంటి మందులు వాడడం వల్ల ఒక ప్రాణం పోయిందని తెలిసిందన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో రోజూ సమీక్షలు పెడతానని, సమస్యలు తీరుస్తానంటూ ఉత్తర కుమారుడి మాదిరిగా సిటీ ఎమ్మెల్యే కబుర్లు చెప్పడం తప్ప ఏమీ చేయడం లేదని భరత్ విమర్శించారు. ఆయన దందాలు, లిక్కర్ సిండికేట్లు, పర్సంటేజీలు, ఇసుక మాఫియా, బ్లేడ్ బ్యాచ్‌లు వంటి వాటిపైనే శ్రద్ధ తప్ప ప్రజా శ్రేయస్సును పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో సరైన వైద్యం అందక నిండు గర్భవతి మరణించడం దారుణమన్నారు. ఇప్పటికైనా బాధ్యులైన వాళ్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామని భరత్‌రామ్ అన్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

సత్యసాయి మార్గం

అనుసరణీయం

శత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



రంగంపేటలో సత్యసాయి జయంతి వేడుకలు



రాజానగరంలో సత్యసాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయి బాబా శాంతి మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. భగవాన్ శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలను ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. రాజానగరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, హారతులిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి ఉపదేశించిన శాంతి, దయ, కరుణ మార్గాల్లో నడుచుకోవాలని, ఆయన సేవలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణనాయక్, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహశీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి సత్యసాయి సేవాసమితి కార్యనిర్వాహక సభ్యుడు ఎల్.సాయి కిరణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సత్యసాయి సేవలను కొనసాగిస్తామన్నారు.మండల, కోటపాడు గ్రామ శాఖల సేవలను వివరించారు.జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు మాట్లాడుతూ మంచి సమాజం కోసం అందరూ సాయితత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సాయి బోధనలు పాఠ్యాంశాలుగా పెట్టాలని ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి కోరారు.ఈ సందర్భంగా సు భద్రంపేటలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పుట్టా సోమన్నచౌదరి, మండల పరిషత్, సేవాదళం సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సత్యసాయి ఉపదేశించిన మార్గంలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్ర మంలో జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ అడపా భరత్, తహశీల్దార్ రామకృష్ణ, నాయకులు సుంకర వీరబాబు, గల్లా రాము, పులపర్తి బుజ్జి,ముప్పిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోను, విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలోను జయంతి ఉత్సవాలు నిర్వహించారు. సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యకృష్ణ, ఏపీఎం సుప్రియ, విశ్వమానవత సంస్థ బిక్కవోలు అధ్యక్షుడు వల్లూరి రామచంద్రరావు, సభ్యులు కండభట్లు వీరభద్రరాజు, భోగిళ్ల రామకృష్ణ, ఏవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఆధ్వర్యంలో సత్యసాయి ధాన్య మండలి అధ్యక్షుడు గుత్తుల వీరభద్రరావు, అడ్వకేట్ గునపర్తి ఆదిలక్ష్మి పర్యవేక్షణలో బాబా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.

అనంతరం కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎం ఈవో తులసీదాస్, డిప్యూటీ ఎంపీడీవో అమ్మిరా జు, నాయకులు మచ్చేటి సత్యప్రసాద్, పండూరి అప్పారావు, యామన నారాయణగౌడ్, ఆళ్ల ఆనందరావు, దిద్దుపూడి రమేష్, బాబుఖాన్ చౌదరి, షేక్ ఖాసీం పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సత్యసాయిబాబా చిత్రపటానికి కమిషనర్ రాహుల్‌మీనా పూలమాలలు వేశారు. ప్రజల కోసం సత్యసాయి తాగు నీరు, విద్య, వైద్యం రంగాల్లో విశిష్ట సేవలందించారన్నారు. విశ్వశాంతి, సర్వమానవ సంక్షేమం ఆయన మార్గామని కీర్తించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ శైలజావల్లి, డిప్యూటి డైరెక్టర్ (అమృత్)రామారావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఈఈ మధర్షాఆలీ, అన్నివిభాగాల అధికారులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రేమే చిహ్నం సేవే మార్గం అంటూ సత్యసాయి చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించి మానవాళికి సేవలందించాలన్నారు. సత్యసాయి విద్య, వైద్యం, తాగునీటికి అత్యధిక ప్రాధాన్యమిచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కూటమి నాయకులు కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండలో బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి మీడియాతో మాట్లాడారు. సత్యసాయి బాబా జయంతిని రాష్ట్రప్రభుత్వం వేడుకగా జరపడం అభినందనీయమన్నారు.పురుషోత్తపట్నం వద్ద సత్యసాయి బాబా సుమారు రూ.500 కోట్లతో గోదావరి జలాలను ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలోని అనేక గ్రామాలకు పైపులైన్ ద్వారా అందించారన్నారు.ఆయన రాజమహేంద్రవరం, సీతానగరం ఇతర గోదావరి ప్రాంతాల్లో అనేక సార్లు పర్యటించారన్నారు.ఆయన ట్రస్టు ద్వారా 70 గ్రామాలకు మంచినీరు ఇప్పటికీ అందజేస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా కోరుకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద సత్యసాయి చిత్రపటానికి మండల పరిషత్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీతానగరం: సీతానగరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి మందిరాన్ని పూలతో అలంకరించారు. తెల్లవారు జామున నగర సంకీర్తన చేసి తదుపరి అష్టోత్తర పూజ, అభిషేకాలు, సాయిగాయిత్రి పారాయణ, మంగళ హారతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం సాయి భజన జరిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమాల్లో సత్యసాయి కమిటీ సభ్యులు, పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా



సీతానగరంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

రాజ్యాంగ దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ



రాజమహేంద్రవరంలో రాజ్యాంగ దినోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో కరపత్ర ఆవిష్కరణ జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎస్సీఎస్టీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వివిధ సాంస్కృతుల విభిన్న వర్గాలు, భిన్న భాషల భారత ఉపఖండాన్ని సుపరిపాలన చేయడానికి భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌ను భారతీయులు ఎన్నడూ మరువలేరన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ చైర్మన్ దాసి వెంకట్రావు రాజ్యాంగ దినోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ అంబేడ్కర్ అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి అహోరాత్రులు కృషి చేసి ప్రపంచంలోనే లిఖితపూర్వకమైన రాజ్యాంగాన్ని అందించారన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాంతాల ఎస్సీ ఎస్టీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

26న రాజ్యాంగ పరిరక్షణ ప్రదర్శన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో రాజమహేంద్రవరంలో ఈనెల 26న రాజ్యాంగ పరిరక్షణ ప్రదర్శన నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు, వ్యవసాయ సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాలు ఉమ్మడిగా ఇచ్చిన పిలుపు ను రాజమహేంద్రవరంలో జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బిక్కవోలులో ఘనంగా వీరభద్రుడి సంబరం



బిక్కవోలులో వీరభద్రుడి సంబరం నిర్వహిస్తున్న భక్తులు

బిక్కవోలు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ఈనెల 26న నిర్వహించే శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్ఠి ఉత్సవాల సందర్భంగా ఆదివారం వీరభద్రుడి సంబరం ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన తొండాపు దుర్గాప్రసాదరెడ్డి అనూష దంపతులు భద్రకాళి సమేత వీరభద్రులను శిరస్సున ధరించి వీరనాట్య కళాకారుల నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా వెళ్లి కాలువ వద్ద జమ్మి చెట్టు వద్ద పూజలు జరిపి గోలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లను అందజేశారు. కార్యక్రమంలో షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, పల్లి రాజారెడ్డి, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, తొండాపు శ్రీనివాసరెడ్డి, జొన్నల వెంకట్రామారెడ్డి, తొండాపు శ్రీను, కొమ్మోజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మాలధారణ

బిక్కవోలులోని 36 మంది భక్తులు ఆదివారం శ్రీకుమార సుబ్రహ్మణ్యస్వామి మాల ధరించారు. అర్చకులు కొడమంచిలి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో మాలధారణ జరిగింది. సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి సందర్భంగా మాల వేయడం ఇదే ప్రథమమని, వచ్చే నెల 3 వరకూ దీక్ష కొనసాగిస్తారని శర్మ తెలిపారు.

పోలవరం నిర్వాసితుల నిరసన దీక్షలు

గోకవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం గోకవరం గ్రామశివారున ఉన్న గంగాలమ్మ గుడి సమీపంలోని ఆర్ అండ్ఆర్ కాలనీలో పోలవరం నిర్వాసితులు చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. గ్రామాలను ఖాళీ చేసే విషయంలో తీసుకున్న శ్రద్ధ తమ ఇబ్బందులను పరిష్కరించడంలో ఎందుకు చూపడంలేదని అధికారుల తీరుపై నిరసనకారులు మండిపడ్డారు. అర్హులైన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించేందుకు ఎందుకు విముఖత చూపుతున్నారో అర్థం కావడం లేదన్నారు. న్యాయపరమైన తమ డిమాండ్లను పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద సమగ్రశిక్ష ఉద్యోగుల దీక్ష

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం సమగ్రశిక్ష ఉద్యోగుల పోరాట దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ వెంకేష్ తెలిపారు. ఈ మేరకు వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నిర్వహించే ఈ పోరాటంలో మండల రిసోర్స్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది. ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ దీక్షలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

నేటి నుంచి రైతన్న కోసం

ఉండ్రాజవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయాధికారి బీ.రాజారావు ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో వివిధ శాఖల సిబ్బంది రైతులకు కరపత్రాలు అందజేస్తారని, ప్రభుత్వం రైతులకు రానున్న ఐదేళ్ల లో చేపట్టే 5 కార్యాచరణ ప్రణాళికలు వివరిస్తారన్నారు.

చెకుముకి జిల్లాస్థాయి సంబరాలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి జిల్లాస్థాయి సంబరాలు ఆదివారం రాజమహేంద్రవరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన పోటీల్లో ప్రైవేట్ పాఠశాలల విభాగంలో రాజానగరం మండలంలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో సీతానగరం మండలం రఘుదేవపురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేజీషియన్ సీహెచ్ శ్రీరాములు మ్యాజిక్ ప్రదర్శన ఇచ్చారు. సైన్స్ రిసోర్సు పర్సన్ బీవీఎల్ఎన్ ఆనంద్‌బాబు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు కె.భీమయ్య, ప్రధాన కార్యదర్శి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

దివాన్‌చెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం-1 ఆధ్వర్యంలో దివాన్‌చెరువులో సోమవారం నుంచి ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 30 వరకూ జరిగే ఈ ప్రత్యేక శిబిరంలో మొక్కలు నాటడం, స్వచ్ఛ భారత్, రక్తదాతల సర్వే, డ్రగ్స్, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన, నేత్ర, దంత వైద్యశిబిరాలు వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం అధికారులు, దివాన్‌చెరువు పంచాయతీ సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

మాక్ అసెంబ్లీకి సతీష్ ఎంపిక



అనపర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి అనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి జి.వీరవెంకట సతీష్ ఎంపికైనట్టు హెచ్ఎం పులగం వెంకటరెడ్డి తెలిపారు. నియోజకవర్గం నుంచి తమ పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సతీష్‌ను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

29న ఇన్సూరెన్స్ ఉద్యోగుల మహాసభలు

ఉద్యోగ సంఘ నాయకుడు సాయిబాబా

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంఘాలు, ప్రతిపక్షాల అభ్యంతరాలు, నిరసనలను బేఖాతరు చేస్తూ లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలులోకి తేవడం దారుణమని ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు పులగుర్త సాయిబాబా అన్నారు. ఈ నెల 29న పాలకొల్లులో ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక చట్టాలు.. కార్మికుల స్థితిగతులు మార్చలేవని ఈ కారణంగా పని గంటలు పెరుగుతాయని, కార్మికుల సంక్షేమానికి బదులు ఇవి కార్పొరేట్ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని కార్మికులు చెప్పడం నిజమన్నారు. లేబర్ కోడ్‌లు కార్మికులకు హానికరమైనవని సీపీఐ(ఎం) చెప్పిందన్నారు. అవి వేతనాలు అనే పదానికి కొత్త నిర్వచనం ఇచ్చాయన్నారు. బోనస్, ఇంటి అద్దె, రవాణా బత్యం, కమీషన్ మొదలైన ప్రయోజనాలను వేతనాల నిర్వచనం నుంచి మినహాయించారని సాయిబాబా పేర్కొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో సత్యసాయి శత జయంతి



సత్యసాయి శత జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. సత్యసాయి చిత్ర పటానికి అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) మురళీ కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యసాయి సేవలు చిరస్మరణీయమని, ఆయన మార్గం అనుసరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుబ్బరాజు, చెంచిరెడ్డి పాల్గొన్నారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

పవర్‌లిఫ్టర్‌కు ఆర్థికసాయం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి ఘాట్ వద్ద గల చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు ఆధ్వర్యంలో పవర్ లిఫ్టింగ్ చాంపియన్ ఆర్జి బాలకృష్ణకు టర్కీ దేశంలోని ఇస్తాన్‌బుల్ నగరంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఆదివారం రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ చెక్కును ట్రస్టు గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా అందజేశారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ప్రేమంటే
సూర్యమినీ	: మఫ్టీ పోలీస్, పాంచ్ మినార్
సూర్యప్యాలస్	: శిశు
స్వామి	: 12 ఎ రైల్వే కాలనీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: 12 ఎ రైల్వే కాలనీ
శివజ్యోతి	: మఫ్టీ పోలీస్
రాజా	: జటాధర
ఊర్వశి	: కొదమ సింహం
మేనక	: శిశు
రంభ	: రాజు వెడ్స్ రాంబాబు
అప్సర	: ది గర్ల్ ఫ్రెండ్
అశోక	: కాంత
వీఎస్ మహల్(నామవరం)	: శిశు
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: 12 ఎ రైల్వే కాలనీ
వెంకటసూర్య(కడియం)	: 12 ఎ రైల్వే కాలనీ
సత్యగౌరి (అనపర్తి)	: ది గర్ల్ ఫ్రెండ్
సూర్యశ్రీ (అనపర్తి)	: 12 ఎ రైల్వే కాలనీ
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: 12 ఎ రైల్వే కాలనీ
రామకృష్ణ(కోరుకొండ)	: 12 ఎ రైల్వే కాలనీ
గీతాసినిమాస్ (సీతానగరం)	: 12 ఎ రైల్వే కాలనీ
శ్రీనివాస (గోకవరం)	: మాస్ జాతర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: 12 ఎ రైల్వే కాలనీ
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్

నా పేరేంటి?

రాజమండ్రినా.. రాజమహేంద్రవరమా?

- గత పుష్కరాల్లో పేరు మార్పు
- మళ్లీ పుష్కరాలు వస్తున్నా అంతే
- కేంద్రం గుర్తించని వైనం
- ఎంపీ చొరవ చూపాలి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమండ్రిని రాజమహేంద్రవరంగా పేరు మార్పుచేసి పదేళ్లు దాటినా ఇప్పటికీ రైలుపై రాజమండ్రి, బస్సుపై రాజమహేంద్రవరం అని దర్శనమిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల బోర్డుల్లో మార్పు లేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు రాజమండ్రి అని పిలుస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం రాజమహేంద్రవరమని సంబోధిస్తోంది. అధికారిక కార్యకలాపాల్లో కూడా రాష్ట్రానికి ఒక పేరుంటే.. కేంద్రానికి మరో పేరు ఉంటూ అయోమయానికి గురిచేస్తున్నాయి. పేరు మార్చి పదేళ్లు దాటినా పాత పేరునే ఇంకా అధికారిక కార్యక్రమాలు సాగుతున్నాయి. మద్రాసును చెన్నై, అహ్మదాబాద్‌ని ప్రయాగ్‌రాజ్ అని పేరు మార్పు చేసిన కొద్ది నెలల్లోనే అటు కేంద్రంలో కూడా కొత్త పేర్లు మనుగడలోకి వచ్చాయి. కానీ రాజమండ్రిని మాత్రం పట్టించుకున్నవాళ్లు లేరు.

రాజమండ్రికి వెయ్యేళ్ల చరిత్ర

రాజమహేంద్రవరానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని రాజరాజనరేంద్రుడు పాలించాడు. ఆయనకు రాజమహేంద్ర అనే బిరుదు ఉంది. దీంతో రాజమహేంద్రవరం అనే పేరు వచ్చిందని చరిత్ర చెబుతోంది. తర్వాత క్రమంలో రాజమహేంద్రిగా.. ఆపై బ్రిటిషర్ల పాలనలో రాజమండ్రిగా రూపాంతరం చెందింది. అందుకే రాజమండ్రి అనే పేరుకు ఎలాంటి ప్రాతిపదిక కనిపించదు. 2015 జూలై 14 నుంచి 25 వరకూ గోదావరికి మహా పుష్కరాలు నిర్వహించారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా సీఎంగా చంద్రబాబు ఉన్నారు. పుష్కరాల చివరి రోజున ఆర్ట్స్ కళాశాల మైదానంలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. చారిత్రక ప్రదేశాలు, చరిత్ర ఆనవాళ్లు తెలిపే పేర్లను మార్చడం సబబు కాదని.. రాజమండ్రిని 'రాజమహేంద్రవరం'గా పేరు మార్పు చేస్తున్నట్టు ప్రకటించారు. 2015 డిసెంబరు 22న వెలువడిన జీవో నెం.483 ఆధారంగా కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో పేరు మార్పును 20/846 అంశంగా చేర్చి అంగీకరిస్తూ తీర్మానించారు. అయినప్పటికీ ఇప్పటికీ కేంద్ర సంస్థల్లో పేరు మారలేదు. టీడీపీ ప్రభుత్వం తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పేరు మార్పును పట్టించుకోలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో కేంద్ర ప్రభుత్వంలో కూడా రాజమహేంద్రవరంగా పేరు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



తెలియక అయోమయం

దూర ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరం వచ్చే వాళ్లు అయోమయానికి గురవుతున్నారు. రైలు, విమాన టికెట్లపై రాజమండ్రి అని ఉంటోంది. ఇక్కడికి వచ్చాక రాజమహేంద్రవరమనే బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల రిజర్వేషను పోర్టల్‌లో రాజమహేంద్రవరం అని, రైల్వే పోర్టల్‌లో రాజమండ్రి ఉండడంతో ఇబ్బంది ఎదురవుతోంది. రైల్వే, పీఎఫ్, పోస్టల్ వంటి కేంద్ర ప్రభుత్వ శాఖలు/సంస్థల కార్యాలయాల బోర్డులు రాజమండ్రి అని ఉంటున్నాయి. ఉదాహరణకు ఏసీబీ, పీఎఫ్ కార్యాలయాలు ఎదురెదురుగా ఉంటాయి. ఈ బోర్డుపై రాజమహేంద్రవరం, ఆ బోర్డుపై రాజమండ్రి అని రాసి ఉంటుంది. అధికారిక ఉత్తరాలు, కార్యకలాపాల్లోనూ ఈ గందరగోళం గోచరిస్తోంది. ఎంపీని రాజమండ్రి ఎంపీ అని, ఎమ్మెల్యేని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే అని వ్యవహరించడం తప్పడం లేదు. ఎంపీ పురందేశ్వరి స్పందించి రాజమహేంద్రవరం అని పేరు మార్పు చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. పేరు మార్చకుంటే మళ్లీ గోదావరి పుష్కరాలకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు ఇబ్బందులకు గురికావడం ఖాయంగా కనిపిస్తోంది.



ట్రాఫిక్ సిగ్నల్స్.. నేలచూపులు!

నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిందని, ట్రాఫిక్ సిగ్నల్స్ సవ్యంగా పని చేస్తే వాహనదారుల అదృష్టమేనని 'ఆంధ్రజ్యోతి' ఆదివారం 'ట్రాఫిక్ టెర్రర్' పేరుతో ప్రచురించిన కథనంలో పేర్కొంది. ఆ కథనం అక్షర సత్యమని ఈ ఫొటోలు రుజువు చేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కంబాల చెరువు కూడలిలోని ట్రాఫిక్ సిగ్నల్స్‌ని పీకేసి ఇలా ఎండలో ఆరబెట్టారు. మిగతా సిగ్నల్స్ నిలబడిన స్థితిలోనే పడుకున్నాయి. ప్రతి కూడలిలో సిగ్నల్స్ పరిస్థితి ఇదేవిధంగా మారడంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఎప్పుడు వెలుగుతాయో, ఏ సమయంలో నిద్రరోతాయే తెలియని ట్రాఫిక్ సిగ్నల్స్‌ని పూర్తిగా తొలగించేస్తే నయమని జనం మండిపడుతున్నారు. పోలీసులకు వాహనదారుల ఫొటోలు తీయడంపై ఉన్న శ్రద్ధ సదుపాయాల కల్పనపై ఉండడం లేదంటూ ఎద్దేవా చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, రాజమహేంద్రవరం



సత్యసాయి సందేశాలు సమాజాన్ని నడిపించే వెలుగులు



సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జేసీ మేఘస్వరూప్, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు.. మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

- జేసీ మేఘ స్వరూప్
- ఘనంగా శత జయంతి వేడుకలు

రాజమహేంద్రవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి ప్రేమ, సేవ, దయపై ఇచ్చిన సందేశాలు ఎప్పటికీ సమాజాన్ని నడిపించే వెలుగులని జాయింట్ కలెక్టర్ వై. మేఘస్వరూప్ అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి జిల్లాస్థాయి వేడుకలను ఆదివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రకాశనం, వేదపారాయణం, భజనలు, కీర్తనలు, నృత్య ప్రదర్శనలతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ సేవే పరమధర్మం అనే సిద్ధాంతాన్ని జీవితాంతం ఆచరించి చూపిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆరోగ్యం, విద్య, శుద్ధజల ప్రాజెక్టులు, పేదల సంక్షేమం, విపత్తుల సమయంలో అందించిన సహాయం వంటి ఎన్నో సేవలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. యువత తమ శక్తి, ప్రతిభ, సమయాన్ని సమాజ సేవలో వినియోగిస్తే దేశ అభ్యున్నతి మరింత వేగవంతమవుతుందని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ భారతీయత సారాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావుడు సత్యసాయి బాబా అని అన్నారు. 140 దేశాల్లో ఆయన సేవలు నడుస్తుండడం విశ్వసేవకు నిదర్శనమన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ పుట్టపర్తి వంటి వెనకబడిన ప్రాంతాన్ని ప్రపంచపటంలో దీటుగా నిలబెట్టిన సాయి సేవలు మరువరానివన్నారు. గురుకుల విద్య తన జీవితానికి మార్గదర్శకమైందన్నారు. శతజయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. రుడా చైర్మన్ వెంకట రమణచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వాలకంటే ముందుగానే తాగునీరు, విద్య, వైద్యం వంటి సంక్షేమ పథకాలను అమలుచేసి లక్షలాది కుటుంబాల్లో సాయిబాబా వెలుగులు నింపారన్నారు. ప్రేమ, సేవ అనే రెండు విలువలను జీవితాంతం ఆచరించి ఆదర్శంగా నిలిచిన మహనీయుడు సత్యసాయి అని, ఉచిత విద్య, వైద్యం, తాగునీరు వంటి సేవలను సాయి సెంట్రల్ ట్రస్టు అందిస్తోందని సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యామ్ సుందర్ తెలిపారు. అన్ని మతాల సారం ఒకటేనన్నదే బాబా బోధనల సారాంశమని ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, ఇంచార్జి డీఆర్వో భాస్కరరెడ్డి, సీపీవో ఎల్. అప్పలకొండ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన..

బాబోయ్.. బాదుడు



- సంక్రాంతి పండుగకు ఊరొచ్చే దారేది
- అప్పుడే బస్సులు, రైళ్లు, విమాన చార్జీల దోపిడీ
- జనవరి 10 నుంచి వీటన్నింటిలో టికెట్ ధరలు మూడింతలపైనే
- హైదరాబాద్ టు రాజమహేంద్రవరం ఏకంగా రూ.16 వేలు దాటేసిన ఇండిగో చార్జి
- బెంగళూరు నుంచి రూ.14వేలపైనే
- హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వైపు వచ్చే రైళ్లన్నీ రిగ్రెట్
- అటు ప్రైవేటు ట్రావెల్ బస్సుల ఏసీ స్లీపర్ చార్జీలు తడిసిమోపెడు
- హైదరాబాద్ నుంచి వచ్చే ఆర్టీసీ ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో జనవరి 9 నుంచే సీట్లు సున్నా

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగకు అప్పుడే చార్జీలు షాక్ కొడుతున్నాయి. స్వగ్రామాలకు రావాలంటేనే టికెట్ ధరలు గూబగుయ్‌మనిపిస్తున్నాయి. బస్సులు.. విమానాలు.. రైలు చార్జీలు మూడింతలు పెరిగిపోయాయి. టికెట్ కొందామన్నా ఏకంగా దొరకని పరిస్థితికి చేరిపోయాయి. వచ్చే ఏడాది జనవరి 14న బుధవారం సంక్రాంతి పండుగ. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు కూడా ముందుగానే జనవరి 10 నుంచి సెలవులు ప్రకటించాయి. దీంతో అప్పటి నుంచి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి పనులపై ఎక్కడెక్కడో ఉంటున్న వారంతా పండుగకోసం ఉమ్మడి జిల్లాలో వారి స్వగ్రామాలకు చేరుకుంటారు. ప్రధానంగా సంక్రాంతికి ఉమ్మడి జిల్లాకు చెందిన వారు హైదరాబాద్ నుంచి ఎక్కువగా వస్తుంటారు. అక్కడ వ్యాపారాలు, ఉద్యోగాలు, సినిమా రంగంలో ఉన్నవారు, పండగ ఆనందాలకు బంధువుల రూపంలో కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ ప్రాంతాలకు వస్తారు. అయితే ఇప్పటి నుంచే చార్జీలు ఆకాశాన్నంటేశాయి. సాధారణంగా సంక్రాంతి పండగకు వచ్చే వారికి ఎప్పుడో డిసెంబరు రెండో వారం నుంచి చార్జీలు పెరుగుతుంటాయి. కానీ ఈసారి పండుగకు ఏకంగా నవంబరుకే అన్నీ మూడింతలు పెరిగిపోయాయి. హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లా వైపు వచ్చే రైళ్లన్నీ నిండిపోయి ఇప్పటికే రిగ్రెట్ చూపిస్తుండడం విశేషం.

బాబోయ్ ఎగరలేం..

పండగ అంటే సంక్రాంతి. ఈ పండుగకు ఎవరు ఎక్కడ ఉన్నా ముందుగానే రెక్కలు కట్టుకుని సొంతూర్లకు రావలసిందే. బంధుమిత్రులతో సరదాగా గడపాల్సిందే. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి సందడే వేరు. భోగిమంటలు, కోడి పందేలు, గుండాట, జాతర్లతో ఏ ఊరు చూసినా సందడిగా మారుతుంది. ఉమ్మడి జిల్లాకు చెందినవారు ఎక్కువమంది సినిమా రంగం, ఐటీ, వ్యాపారరంగాలు, ఉద్యోగాల పేరుతో హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. వారంతా పిల్లాపాపలతో సొంతూర్లకు చేరుతారు. అయితే పండుగకు ఇంకా యాభై రోజులు ఉండగానే చార్జీలు మాత్రం అప్పుడే షాక్ కొట్టేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి సాధారణ రోజుల్లో ఇండిగో టికెట్ చార్జీ రూ.4,271 వరకు ఉంటోంది. కానీ జనవరి 10 నుంచి మాత్రం చూస్తే గుండె గుబేల్‌మంటోంది. ఏకంగా ఈ రూట్లో అప్పుడే టికెట్ చార్జీ గరిష్ఠంగా రూ.16,241కి చేరిపోయింది. ఈ మార్గంలో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి రోజూ ఇండిగో నాన్‌స్టాప్, సింగిల్‌స్టాప్ కేటగిరీలో ఎనిమిది సర్వీసులు నడుపుతోంది. కానీ సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అప్పుడే ధరలను భారీగా పెంచేసింది. పండుగకు ఎక్కువమంది కాస్త ధర ఎక్కువైనా వేగంగా వచ్చేందుకు విమానాలనే ఎంచుకుంటున్నారు. దీంతో జనవరి నుంచి భోగి పండుగ రోజు వరకు చార్జీలను దారుణంగా పిండేస్తోంది. తీరా సంక్రాంతి పండుగ రోజురూ.5,800 మాత్రమే వసూలు చేస్తోంది. అటు బెంగళూరులో పనిచేస్తోన్న ఉమ్మడి జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పండుగకు ముందే వస్తారు. వీరిని కూడా జనవరి 10వ తేదీ నుంచి రూ.14 వేల వరకు పిండేస్తోంది. సాధారణ రోజుల్లో ఈ రూట్లో చార్జీ రూ.4,763కాగా, పండగ సాకుతో మూడింతల పైనే వసూలు చేస్తోంది.

రైళ్లన్నీ రిగ్రెట్...

హైదరాబాద్ నుంచి సంక్రాంతి పండగకు ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, సామర్లకోట, కడియం, అన్నవరం, తుని, కోనసీమ ప్రాంతాలకు వచ్చే వారంతా ఎక్కువగా రైళ్లపై ఆధారపడతారు. తీరా ఇవి కూడా వెయిటింగ్ లిస్ట్ కూడా నిండిపోయి ఏకంగా రిగ్రెట్ చూపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఈ రూట్లో రైళ్లకు రద్దీ ఎప్పుడూ ఉంటుంది. తీరా సంక్రాంతి పండుగకు అయితే అంతకుమించి అన్నట్టు మారిపోయింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లా మీదుగా నిత్యం 17 రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే పండగ నేపథ్యంలో జనవరి 10 నుంచి ఇవన్నీ నిండిపోయాయి. ఎప్పుడూ ఎన్నోకొన్ని సీట్లు ఖాళీగా ఉండే వందే భారత్ రైళ్లలో కూడా జనవరి 10 నుంచి 13వ తేదీ వరకు రిగ్రెట్ చూపిస్తోంది. అంటే వెయిటింగ్ లిస్ట్ టిక్కెట్లు కూడా అయిపోయి టికెట్ కూడా ఇవ్వని పరిస్థితికి చేరింది. అలాగే గరీబ్‌రథ్ జనవరి 12వరకు రిగ్రెట్ చూపిస్తోంది. విశాఖ ఏసీ ఎక్స్‌ప్రెస్, ఫలక్‌నుమా, గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ 13వ తేదీ వరకు రిగ్రెట్ కనిపిస్తోంది. చర్లపల్లి, సాయినగర్ షిర్డీ, ఈస్ట్‌కోస్ట్, కోణార్క్, విశాఖ ఎల్‌టీటీ సైతం అదే పరిస్థితి. చివరకు హైదరాబాద్ నుంచి వచ్చే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కూడా 13 వరకు సీట్లన్నీ రిగ్రెట్‌లోకి వెళ్లాయి.

ట్రావెల్స్ ఉతుకుడు..

ప్రైవేటు ట్రావెల్స్ విషయానికొస్తే హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం వైపు వచ్చేవన్నీ అప్పుడే చార్జీలు మూడింతలు పెంచేశాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వైపు ఏసీ స్లీపర్ బస్సు చార్జీలు రూ.1079 నుంచి రూ.1419 వరకు ఉన్నాయి. కానీ సంక్రాంతి దోపిడీలో భాగంగా జనవరి 10 నుంచి ఏకంగా ఆయా ట్రావెల్స్ ఆధారంగా రూ.4150 నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే సగానికిపైగా సీట్లు ఫుల్ అయినట్టు చూపుతున్నాయి. పండుగ దగ్గరయ్యే కొద్దీ ఈ రేట్లు మరింత పెంచడానికి సిద్ధమవుతున్నాయి. ఇక హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఆర్టీసీ రోజుకు 15 ఏసీ, నాన్‌ఏసీ సూపర్‌లగ్జరీ బస్సులు నడుపుతుండగా, జనవరి 9 నుంచి 12 వరకు మూడు రోజుల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేదు. మొత్తం అన్నీ బుక్ అయిపోవడంతో సోల్డ్‌అవుట్ కనిపిస్తోంది. కాకినాడకు హైదరాబాద్ నుంచి రోజూ ఆరు సర్వీసులు నడుస్తుండగా జనవరి 9 నుంచే ఫుల్ అయిపోయాయి

ఆన్‌లైన్ రిజిస్టర్లు లేవు..

- మాన్యువల్‌గా చూస్తున్నారు
- కాలం చెల్లిన మందుల విచారణలో అధికారుల నివేదిక?



విలేకరులతో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రుల్లో కాలం చెల్లిన మందులను ఇస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు చేపట్టిన దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగుచూశాయి. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి వచ్చిన మందులను ఆన్‌లైన్ చేయకుండా ఆఫ్‌లైన్‌లో రిజిస్టర్‌లు నిర్వహిస్తున్నారంటూ దర్యాప్తులో పేర్కొన్నారు. దీనివల్ల ఏ మెడిసిన్ ఎవరికి అందుతున్నదానిపై పూర్తి వివరాలు తెలియడం లేదని, దీనిపై వైద్యాధికారులకు శిక్షణ ఇవ్వాలని సూచించినట్టు సమాచారం. అయితే కాలం చెల్లిన మందులను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సక్రమంగా నిర్వహణ చేయడంలేదనే విషయాన్ని దర్యాప్తు అధికారులు ప్రధానంగా ప్రస్తావించినట్టు సమాచారం. ఇదిలా ఉంటే కాలం చెల్లిన మందులను ఇచ్చారంటూ సీఎంకు వెళ్లిన ఫిర్యాదు, తదనంతర పరిణామాలపై దర్యాప్తు అధికారులు స్పష్టమైన నివేదిక రూపొందించలేదని తెలుస్తోంది. నారాయణపురం పరిధిలోని చౌడేశ్వరీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి 55 ఏళ్ల మహిళ రెండు దఫాలుగా మందులను తీసుకున్నట్టు నిర్ధారించినా ఆ మందుల ఎక్స్‌పైర్ విషయంలో ఎలాంటి స్పష్టత రావడంలేదు. ఆఫ్‌లైన్‌లో రిజిస్టర్‌లు ఉండడంతో వివరాలు దర్యాప్తులో తేలనట్టు సమాచారం.

జీజీహెచ్‌కు సంబంధం లేదు

- అయినా సమగ్ర విచారణకు ఆదేశం
- 48 గంటల్లో కలెక్టర్‌కు నివేదిక
- : జీజీహెచ్ సూపరింటెండెంట్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చిన ఒక వ్యక్తికి కాలం చెల్లిన బీపీ మందులు ఇచ్చారంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. అయినా ఈ ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించామని, 48 గంటల్లో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు ఆదివారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని తన చాంబర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి డ్రగ్ స్టోర్, ఫార్మసీ రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ఇతర అంశాలను సమగ్రంగా పరిశీలించామని తెలిపారు. సంబంధిత కాలం చెల్లిన బీపీ మాత్రల బ్యాచ్ జీజీహెచ్‌లో ఎప్పుడూ రాలేదని, అయినా దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రాథమిక నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వాధికారులకు నివేదించామని తెలిపారు. కాలం చెల్లిన టాబ్లెట్లు రాజమహేంద్రవరంలోని ఒక అర్బన్‌హెల్త్ సెంటర్ ద్వారా ఇచ్చినట్టు సమాచారం ఉందని, అయితే సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వారి వివరాలు, స్థలం కచ్చితంగా తెలపకపోవడంతో నిర్ధారించడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ విషయమై నిజానిజాలు, వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికి నలుగురు అధికారులతో విచారణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణంరాజు, ఆర్‌ఎంవో డాక్టర్ ఆర్‌వీ సుబ్బారావు, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ (డ్రగ్‌స్టోర్స్) డాక్టర్ షేక్ నసీరుద్దీన్, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పి.శ్రీనివాస్‌లతో కూడిన కమిటీ రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు సమర్పించాల్సిందిగా ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ పి.శ్రీనివాస్, ఆర్‌ఎంవో డాక్టర్ సుబ్బారావు, డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జి డాక్టర్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

రూ.8 లక్షల ఆభరణాల బ్యాగ్ అప్పగింత

రైలులో వదిలేసిన ప్రయాణికులు అప్పగించిన ఆర్పీఎఫ్ పోలీసులు



ఆభరణాలను అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ రాజు

రాజమహేంద్రవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైలు ఎక్కే హడావుడిలో ఇబ్బంది ఏర్పడి రైలులో వదిలేసిన బంగారు ఆభరణాలున్న బ్యాగును ప్రయాణికులకు రాజమండ్రి రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) పోలీసులు సురక్షితంగా అప్పగించారు. ఆర్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ బి.రాజు వివరాల ప్రకారం.. కర్నాటకలోని బళ్లారికి చెందిన బి.విశ్వనాథరెడ్డి తన భార్యతో అన్నవరం వచ్చారు. తిరుగు ప్రయాణంలో రైలు ఎక్కడానికి స్టేషన్‌కు వెళ్లారు. బిలాస్‌పూర్-తిరుపతి రైలు అప్పటికే కదిలే స్థితిలో ఉంది. దీంతో విశ్వనాథరెడ్డి హడావుడిగా లగేజీ తీసుకొని బీ5 కోచ్ ఎక్కి వాటిని ఓ బెర్తులో పెట్టారు. కానీ అప్పటికే రైలు కదలడంతో భార్య ఎక్కలేకపోయారు. ఇది గమనించిన భర్త కూడా కిందకు దిగిపోయారు. లగేజీలు మాత్రం రైలులో ఉండిపోయాయి. దీంతో తర్వాత స్టాప్ అయిన రాజమండ్రి ఆర్పీఎఫ్‌కి సమాచారమిచ్చారు. ఇన్స్‌పెక్టర్ రాజు తమ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రైలు స్టేషనుకు వచ్చిన వెంటనే ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.శ్రీనివాసులు, హెచ్‌సీ త్రినాథరావు తదితర సిబ్బంది కోచ్‌లోని రెండు ట్రాలీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. విశ్వనాథరాజు దంపతులకు సమాచారం ఇవ్వగా వాళ్లు స్టేషనుకు వచ్చారు. వారి సమక్షంలో బ్యాగులను తెరవగా రూ.8లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు సురక్షితంగా ఉన్నాయి. వాటిని వారికి ఇన్స్‌పెక్టర్ రాజు అప్పగించారు. ఆభరణాలు అప్పగించిన వారికి భార్యాభర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

గోలింగేశ్వరుడుకి లక్షపత్రి పూజ


ఆలయంలో పూజ నిర్వహిస్తున్న వేదపండితులు

నిడదవోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వేంచేసివున్న రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి 655వ లక్షపత్రిపూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాకోళపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేదపండితులు గోలింగేశ్వరుడికి విశేష అభిషేకాలు, లక్షపత్రి పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నామా సూర్యప్రకాశరావు ఏర్పాట్లను పర్యవేక్షించగా, భక్తులు పెద్దఎత్తున స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిడదవోలులో దివ్యాంగులకు క్రీడాపోటీలు


ప్రభుత్వ మహిళా కళాశాలలో కబడ్డీ ఆడుతున్న దివ్యాంగులు

నిడదవోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని ఎస్వీడీ ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో మానసిక , శారీరక దివ్యాంగుల కేంద్రమైన హృదయాలయానికి చెందిన దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. షెటిల్ బ్యాడ్మింటన్, పరుగు పందెం, కబడ్డీ, షాట్‌పుట్‌లో దివ్యాంగులు మేము సైతం అంటూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. దివ్యాంగులకు ఫిజికల్ డైరెక్టర్ అశోక్, తదితరులు పోటీలు నిర్వహించారు. హృదయాలయ నిర్వాహకులు దండే గణేష్ బాబు, బలగం విశాలాక్షి పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు డిసెంబరు 3న బహుమతులు అందించనున్నట్టు వారు తెలిపారు.

మాజీ సైనికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి, పక్కన చైర్‌పర్సన్

కొవ్వూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వార్షిక సమావేశం ఆ సంఘం అధ్యక్షుడు పిల్లి ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావనరత్నకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ పారామిలటరీకి సంబంధించి ప్రభుత్వం వద్ద అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. సూరపనేని చిన్ని, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సూర్యదేవర రంజిత్, సంఘం సభ్యులు బీ.రాజేశ్వరరావు, వి.తాతారావు, వి.వేణుగోపాల్, డీవీవీ ప్రసాద్, కె.దామోదర్, పి.కోటేశ్వరరావు, కె.వీరభద్రం పాల్గొన్నారు.

కోటసత్తెమ్మను దర్శించుకున్న అంబికా కృష్ణ


ఆలయంలో వేదాశీర్వచనం అందుకుంటున్న సినీ నిర్మాత అంబికా కృష్ణ

నిడదవోలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారిని ఆదివారం ప్రముఖ సినీ నిర్మాత, వ్యాపారవేత్త అంబికాకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ, తదితరులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, కేదారిశెట్టి రవికుమార్, బచ్చు సుమన్ కుమార్, బచ్చు లక్ష్మణరావు, గ్రంధి బాలాజీ, తదితరులు ఉన్నారు.

ఉండ్రాజవరంలో ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



ఉండ్రాజవరం వృద్ధుల ఆశ్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు

ఉండ్రాజవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):స్థానిక జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తర్వాత స్థానిక వృద్ధుల ఆశ్రమంలో విద్యార్థులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించుకోవాలని అధికారులు సూచించారు. ఎంఈవో సక్సేనరాజు, ఎన్‌సీసీ ఏఎన్‌వో బీఎస్. స్వామి, హెచ్‌ఎం పి. రామకృష్ణ, టీచర్లు కె. సంధ్యారాణి, సీహెచ్ దుర్గాప్రసాద్, సీతామహాలక్ష్మి, కె. అరుణ, డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే శిక్ష తప్పదు

● శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధరరావు ● విద్యార్థులకు అవగాహన సదస్సు


విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్ఐ గంగాధరరావు

దేవరపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన శిక్ష తప్పదని శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధరరావు హెచ్చరించారు. గౌరీపట్నంలోని సెంట్‌మేరీస్ ఎస్ఎన్ హెచ్ హాస్టల్ విద్యార్థినులకు శక్తి టీమ్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగిందని తెలిపారు. అలాగే మహిళా చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత ఫోన్స్ కాల్స్‌కు స్పందించరాదని, ముఖ్యంగా సైబర్‌నేరాలు ఎక్కువగా జరుగుతుండడం వల్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీమ్ కానిస్టేబుళ్లు భవాని, పద్మ, వరలక్ష్మి, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు వైద్యపరీక్షలు


విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం ఎస్సీ ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థులకు ఆదివారం పీహెచ్‌సీ డాక్టర్ బీ. దుర్గామహేశ్వరరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను ఖచ్చితంగా పాటించాలన్నారు. అలాగే వేడిగా ఉన్న ఆహారపదార్థాలను తీసుకోవాలని సూచించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హాస్టల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహం సందర్శన

పెరవలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల క్రేందంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కానూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి హేమరాజు ఆదివారం సందర్శించారు. ఈ సందరంగా పిల్లలతో మాట్లాడి వారి అలవాట్లు, లక్ష్యాలను తెలుసుకున్నారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజ్యమోహన్, నాగేశ్వరరావు, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి

నల్లజర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే నిలుపుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కొక్కిరిపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పరిశ్రమల్లో కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఎనిమిది గంటల పని దినం, గ్రాట్యుటీ వంటి సదుపాయాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఈయనతోపాటు తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా శత జయంతి

● వాడవాడలా ఉత్సవాలు నిర్వహించిన భక్తులు ● పలుచోట్ల ప్రత్యేక పూజలు, అన్నదానాలు


మున్సిపల్ కార్యాలయంలో సత్యసాయిబాబాకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి


నిడదవోలులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ


నల్లజర్లలో సత్యసాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న తహశీల్దార్ కృష్ణారావు

కొవ్వూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా సేవలు ఆచరణీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన సత్యసాయి 100వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, బోడపాటి ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ సత్యసాయి సేవా కేంద్రం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు సత్యసాయి సేవా కేంద్రంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి , ఆర్డీవో రాణీసుస్మిత ముఖ్య అతిథులుగా పాల్గొని నివాళి అర్పించారు. అన్నదాన పథకంలో భాగంగా ఆసుపత్రిలోని రోగుల బంధువులకు అన్నదానం చేశారు.

నిడదవోలు: భగవాన్ సత్యసాయిబాబా సందేశాలు అందరికీ మంచి మార్గాలు చూపుతాయని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సత్యసాయి శతజయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సత్యసాయి శతజయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించడం ఎంతో ఆనంద దాయకమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, మద్దిపాటి నాగశ్రీ, భగవాన్ సత్యసాయి సేవా సంఘం ప్రతినిధులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి వెలిగించి ఆయన చిత్రపటానికి పుష్పాలు సమర్పించారు. అనంతరం భజనలు, కీర్తనలు ఆలపించారు. సత్యసాయి బాబా బాల వికాస్ వారి ద్వారా హారతులు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల సీతారామప్రసాద్, ఉమారాజ్యలక్ష్మీ పద్మజ, బాల వికాస్ సభ్యుడు ఉమామహేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలో పుట్టపర్తి సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నల్లజర్ల వెంకటపతి ఆసుపత్రి వద్ద వేడుకలు జరిగాయి. ప్రభుత్వ పరంగా ఎంపీడీవో కార్యాలయంలో తహశీల్దార్ కృష్ణారావు సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేశారు. అలాగే అనంతపల్లిలోనూ మంచిరాజు భుజంగరావు ఇంటి వద్ద 400 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ప్రత్యేక అభిషేకాలు, అఖండ నామసంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో సత్యసాయిబాబా శతజయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు పంచాయతీ కార్యాలయాల్లో సత్యసాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలోబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరన్న, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రమాదేవి, అన్నదేవరపేట కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్ తదితర గ్రామాల కార్యదర్శులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తాళ్లపూడి గీతామందిరం వద్ద శత జయంతి సందర్భంగా సాయి సేవా సమితి సభ్యులు వృద్ధులకు దుప్పట్లు పంచి పెట్టారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మండలంలోని సాయిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపురం: నేటి సమాజానికి భగవాన్ సత్యసాయిబాబా సేవలు స్ఫూర్తిదాయకమని దాత కర్లపూడి చిన్నబ్బాయి, జలావతి దంపతులు అన్నారు. స్థానిక బాబా ధ్యానమందిరం వద్ద శతజయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయి, జలావతి దంపతులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం చేపట్టిన నాటి నుంచి ప్రతిఏటా బాబావారి జయంతిని పురస్కరించుకుని భక్తులకు నూతన వస్త్ర, అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బాబా పుట్టినరోజు సంఖ్యను బట్టి పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యండ్రప్రగడ వెంకటేశ్వరరావు, చదలవాడ సత్య, కాకర్ల జగ్గారావు, భక్తులు, పాల్గొన్నారు. అనంతరం 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తర్వాత అన్నసమారాధన నిర్వహించారు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ఎంపీడీవో రాజమనోహర్ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా శతజయంతిని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి రామచంద్రరావు, తహశీల్దార్ సాయిప్రసాద్, ఈవోపీఆర్డీ ఆర్.సుజాత, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

చాగల్లు : ఎస్. ముప్పవరంలో భగవాన్ సత్యసాయి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని బాబా భక్తులు నారాయణ సేవ పేరుతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడారు. సేవాభావంతో జీవితం సాగించాలనే ఆయన ఆశయాలు మనకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి వేడుకలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, దేవరపల్లి సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు, సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ సత్య సాయిబాబా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి ఆయన ఎంతో కృషి చేశారని, మానవసేవే మాధవసేవ అని కొనియాడారని, ఎందరో పేదలకు ఆయన ఉచిత వైద్యం ఆయన ట్రస్ట్ ద్వారా అందించారని అన్నారు. కార్యక్రమంలో సత్యసాయి స్కూల్ కరస్పాండెంట్ సత్తిరాజు వేణుగోపాలరావు, కార్యదర్శులు అమ్మిరాజు, ఎన్.రవికిషోర్, వీఆర్వోలు, సత్యసాయి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురంలో ...


దేవరపల్లిలో ..

నేటి నుంచి గ్రామాల్లో రైతన్న కోసం కార్యక్రమాలు

ఉండ్రాజవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి బీ. రాజారావు ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో వివిధ శాఖల సిబ్బంది రైతులకు కరపత్రాలు అందజేస్తారని చెప్పారు. ప్రభుత్వం రైతులకు రానున్న ఐదు సంవత్సరాల్లో రాజును చేయడానికి రాష్ట్రప్రభుత్వం చేపట్టే 5 కార్యాచరణ ప్రణాళికలు వివరిస్తారని తెలిపారు. నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, సాగులో టెక్నాలజీ వాడకం, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ విధానాల గురించి రైతులకు వివరిస్తారని చెప్పారు. ఈనెల 29వ తేదీ వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పశివేదల సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పశివేదల ఫీడర్, 11 కేవీ పశివేదల ఏజీఎల్, 11 కేవీ దొమ్మేరు, 11 కేవీ నందమూరు ఏజీఎల్ వార్షిక మెయింటెనెన్స్ పనుల నిమిత్తం సోమ, మంగళవారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ ఎన్. నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి ఉదయం నాలుగు నుంచి తొమ్మిది గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఆరు గంటల వరకు ఉంటుందన్నారు.

మాక్ అసెంబ్లీకి అనపర్తి విద్యార్థి ఎంపిక

అనపర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించే మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి అనపర్తిలోని శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి జీ. వీరవెంకట సతీష్ ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం పులగం వెంకటరెడ్డి తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీలో ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాత్రమే కూర్చునే అవకాశం ఉందని, అయితే రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అదే అసెంబ్లీలో విద్యార్థులచే అసెంబ్లీ నిర్వహించడం వంటి అరుదైన కార్యక్రమం అభినందనీయమన్నారు. అనపర్తి నియోజకవర్గం నుంచి తమ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యక్షంగా వీక్షిస్తారని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థులు


రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులు

దేవరపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న టెన్నికాయిట్ సెలక్షన్లు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ రామన్నపాలెం హైస్కూల్‌లో ఈనెల 15వ తేదీ నుంచి 23 వరకు జూనియర్ టెన్నికాయిట్ పోటీలు జరిగాయని, అందులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26వ తేదీ నుంచి 30 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే పోటీల్లో ఏపీ తరపున పాల్గొంటారని తెలిపారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన శిక్షణకు స్థానిక టీడీపీ నేతలు పరిమి శ్రీరామకృష్ణ, కాట్రగడ్డ రామ్మోహన్, కాట్రగడ్డ సోమరాజు, పరిమి వెంకటేశ్వరరావు, అన్నంరెడ్డి బాలు, గంగుల నాగరాజు, అన్నివిధాలా సహకారం అందించారన్నారు. రాష్ట్ర జట్టులో ఎం. పవన్‌కుమార్ (పశ్చిమగోదావరి), కే.శివశంకర్ ప్రసాద్ (కాకినాడ), బీ.సత్యనారాయణ (కాకినాడ), ఎన్.గౌతమ్ సంజయ్ (కాకినాడ), కే.చంద్రమౌళి (విజయనగరం), కే.ప్రవీన్ కుమార్ (శ్రీకాకుళం), అలాగే బాలికల విభాగంలో సుప్రియ (అనంతపురం), జ్యోతిక (అనంతపురం), ఇందు (విజయనగరం), రాపాక సంస్కృతి (తూర్పుగోదావరి), కే.అనిత (కోనసీమ), లావణ్య (కోనసీమ) ఉన్నట్టు తెలిపారు. పీడీలు ఆచంట వెంకటేశ్వరరావు, తలారి సరస్వతి, మంచిలి చిన రామారావు శిక్షణ ఇచ్చారన్నారు.

ప్రతి రూపాయీ వచ్చేటట్టు చూడడం కమిషన్ బాధ్యత

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ● ధర్మవరం గ్రామస్థులకు హామీ



జవహర్‌ను సత్కరిస్తున్న ధర్మవరం గ్రామస్థులు

కొవ్వూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పోస్టు ఆఫీసులో 2020 -22 మధ్య చోటు చేసుకున్న రూ.1.60 కోట్ల స్కామ్‌లో దళితులకు రావాల్సిన సొమ్ము దఫదఫాలుగా రాబట్టే ప్రక్రియ కొనసాగుతోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.జవహర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ధర్మవరం గ్రామస్థులు జవహర్‌ను ఆయన నివాసంలో కలుసుకుని సత్కరించారు. పోస్టు ఆఫీసులో రూ. 1.60 కోట్లను దళితులు నష్టపోయారు. దానిలో మొదట విడతగా రూ. 30 లక్షలు విడుదల కాగా, జవహర్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత మరో రూ. 25లక్షలు విడుదలయ్యాయి. దీనిపై బాధితులు జవహర్‌ను కలిసి నష్టపోయిన మొత్తం సొమ్ము విడుదలయ్యేలా చూడాలని కోరారు. దీనిపై జవహర్ మాట్లాడుతూ పోస్టల్ అధికారులతో మాట్లాడడం ద్వారా దాదాపు రూ. 20 లక్షలు లబ్ధిదారులకు చేరాయని, ఇంకా సుమారు రూ. 60 లక్షలు రావాల్సి ఉందన్నారు. పాస్‌బుక్‌లలో ఎంట్రీ చేయకుండా కాగితాలపై రాసిన కేసులను పోస్టు మాస్టార్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. స్పందన రాకపోతే నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ స్కామ్ కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని, దళితుల ఆర్థిక హక్కులు దెబ్బతిన్నాయన్నారు. కలిసినవారిలో పాతగొలుసు భారతి, ఎల్లే దుర్గ, కొయ్యే రాధాకృష్ణ, నిమ్మగడ్డ నాగమ్మ, జొన్నకూటి సుబ్బలక్ష్మి, నీరుడు సతీష్, తుక్కయ్య, దాసరి నిర్మల, కొట్టేపాటి తాతారావు, జొన్నకూటి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

నేడు చాగల్లులో మంత్రి నాదెండ్ల పర్యటన

చాగల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం చాగల్లులో పర్యటించనున్నట్టు మండల వ్యవసాయశాఖాధికారి కే. వేణుగోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మధ్యాహ్నం రెండు గంటలకు చాగల్లు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఇక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్ఠి మహోత్సవం


దేవరపల్లిలో పాలకావిడి సేవలో భక్తులు

దేవరపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో షష్ఠి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పాలకావిడి సేవా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పురవీధుల్లో పాలకావిడి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాట్రు బీమరాజు, అంబటి వీరవెంకటసత్యనారాయణరావు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, జల్లు రాంబాబు, ఆలయ అర్చకులు అఖండం వీరవెంకటరాజు శర్మ, సతీశ్‌కుమార్‌శర్మ, వంశీకృష్ణమూర్తి శర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెరవలి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఖండవల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముక్కామలకు చెందిన కౌరు సత్యనారాయణ (38) , బాలం గోవిందు అనే ఇద్దరు మోటారు సైకిల్‌పై వెళుతుండగా రవళి స్పిన్నింగ్ మిల్లు సమీపంలో శనివారం సాయంత్రం ఒక కారు వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో ప్రమాదం జరిగింది. అనంతరం ఇరువురిని తణుకు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కౌరు సత్యనారాయణ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్యనారాయణ భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థినులకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన ముగ్గురు విద్యార్థినులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం తరఫున ఆదివారం విరాళాన్ని అందజేశారు. బల్లిపాడులో వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధి పరస రాధాకృష్ణ మాట్లాడుతూ మేలిమి పోసమ్మ, గండి శ్రీలక్ష్మి, బోడపాటి ధరణికు బలమైన గాయాలై... కాళ్ల విరిగిపోవడంతో రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్ల సూచించారన్నారు. ఈ మేరకు నిరుపేద కుటుంబాలైన వీరిని ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయిస్తూ ఒక్కో కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు అడ్డాల డేవిడ్ రాజు, మారిశెట్టి సత్యనారాయణ, శీర్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీత చంటమ్మ మృతి


అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్‌తో చంటమ్మ (ఫైల్)

కొవ్వూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి అవార్డు గ్రహీత, 103 సంవత్సరాల వయస్సు గల పంగిడి మాజీ సర్పంచ్ యాళ్ల చంటమ్మ ఆదివారం ఉదయం మృతిచెందారు. ఈమె 2006 నుంచి 2011 వరకు పంగిడి సర్పంచ్‌గా పనిచేశారు. కాగా, 2011 అక్టోబర్ 20వ తేదీన నిర్మల్ గ్రామీణ పురస్కార్ అవార్డును అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ చేతులమీదుగా అందుకున్నారు. దీంతో పంగిడిని ఢిల్లీ స్థాయిలో నిలబెట్టిన వీరమహిళగా చరిత్రలో కెక్కారు. ఈమె మృతిపై గ్రామసర్పంచ్ గోశాల నాగార్జున, ఉప సర్పంచ్ ఉప్పులూరి ఫణి వెంకట కృష్ణారావు (నానాజీ), కోమటి కృష్ణంరాజు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.